ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 8 మార్చి 2025



అన్నింటా.. ఆమె

8

ఆమె.. ఇంటితో పాటు పాలనా వ్యవహారాలను, సమాజాన్ని, పరిశ్రమలను చక్కదిద్దుతున్నది. కుటుంబ బాగోగులు ఏ విధంగా అయితే చూసుకుంటారో అదే రీతిన సమాజాన్ని, విధివంచితులను ఆదుకునేందుకు ముందడుగు వేస్తున్నారు. సేవారంగంలోనూ, పారిశ్రామికవేత్తలుగా రాణిస్తూ ఎందరికో స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నారు. అపరిమితమైన ప్రేమను సేవాభావంతో సాటి మహిళలకు, సమాజానికి పంచుతున్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమై కేవలం గృహిణిగానే మిగిలిపోయిన సగటు మహిళ నేడు ఆకాశమే హద్దుగా దూసుకు పోతోంది. ఆకాశంలో సగమైన ఆధునిక మహిళ అన్ని రంగాల్లో తన సత్తా చాటడమే కాదు.. అనేక రంగాల్లో తనదైన ముద్ర వేస్తోంది. ఒకప్పుడు వంటిట్లో గరిటతో సహవాసం చేసిన మహిళ సేవారంగంలో అమ్మగా.. రాజకీయాల్లో రాజసంగా.. పాలనలో పథగామిగా.. పోరాటంలో వీరవనితగా.. ముందడుగు వేస్తోంది. అబల అంటూ సమాజం తనపైన వేసిన ముద్రను చెరిపేస్తూ తన 'సబల'త్వాన్ని ప్రపంచానికి చాటి చెబుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో స్ఫూర్తి దాయకంగా ఎందరో మహిళలు ఉన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తిదాయక మహిళల్లో కొందరు గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం..

అమరావతి రాజధాని కలిగిన కీలకమైన గుంటూరు జిల్లా బాధ్యతలను మహిళా అధికారులైతేనే సమర్థవంతంగా నిర్వహిస్తారన్న భావనతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వమ్ము చేయకుండా పాలన, అభివృద్ధి అంశాల్లో రాణిస్తున్నారు. రాజకీయ చైతన్యానికి మారుపేరుగా నిలిచిన ఉమ్మడి గుంటూరు జిల్లాలో అటు రాజకీయ నాయకులు, ఇటు ప్రజలు, మరోవైపు ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గుంటూరు జిల్లాలో కీలకమైన 16 ప్రభుత్వ శాఖలకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారు.

నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి ఆయువు తీసేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించగా గ్రామీణ మహిళలు కులమతాలకు అతీతంగా రోడ్డెక్కి చేసిన పోరాటం దేశాన్నే ఆశ్చర్యపరిచింది. ప్రభుత్వ కుట్రలను ధీరోదాత్తంగా ఎదుర్కొని అమరావతి సమరావతిగా మారింది.. అబలలుగా ముద్రపడిన మహిళలు సబలలుగా మారి ఐదేళ్లపాటు పోరాటం చేసి అమరావతిని అజరామరం చేశారు.

చిన్న వయసులోనే హెచ్ఐవీతో భర్తను కోల్పోయి.. అయినవాళ్ల అవమానాలతో కుంగిపోకుండా తనలా మారిన ఎందరో బాధితులను అక్కున చేర్చుకున్న సగటు మహిళ.. ఆదర్శ మహిళగా షిప్ సంస్థ వ్యవస్థాపకురాలు గుంటూరుకు చెందిన రమాదేవి నిలిచారు.

- సేవ నుంచి సమరం వరకు సబలలు
- ఎందరికో స్ఫూరిగా మారి అద్భుతాలు సృష్టి
- అమరావతి ఉద్యమంలో ఉద్భవించిన వీరమాతలు
- సంక్రమణ వ్యాధుల పనిపట్టేలా డాక్టర్ శారద కృషి
- ఆక్వా పరిశ్రమలో ఆదర్శప్రాయంగా అనంత విజయ
- షిప్ సంస్థ ద్వారా హెచ్ఐవీ బాధితులకు బాసటగా రమాదేవి
- మదర్ థెరిస్సా స్ఫూర్తితో అనాథ పిల్లల సేవలో డాక్టర్ మంగాదేవి
- అధికారి నుంచి ప్రజాప్రతినిధుల వరకు కీలక బాధ్యతలు

బాపట్లలోని బెస్తపాలెం నుంచి ఆక్వా రంగంలో అత్యున్నత శిఖరాలు అందుకున్న మత్స్యకార మహిళ అనంత విజయ అవార్డులతో పాటు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. మహిళలను నిర్లక్ష్యం చేయకుండా ప్రోత్సహిస్తే ఉన్నతంగా రాణిస్తారని అనంత విజయ నిరూపించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న శారద

డాక్టర్‌గా నాలుగు గోడల మధ్య వైద్యం అందించడానికి పరిమితం కాకుండా సాటి మహిళల కష్టాలు తీరుస్తూ తెనాలికి చెందిన డాక్టర్ శారద మేటి మహిళగా నిలిచారు. సాటి మహిళల కోసం తన వంతుగా సేవ చేసే అవకాశం దక్కడాన్ని డాక్టర్ శారద గర్వంగా భావిస్తున్నారు.

చిన్నారుల కోసం మంచి పాఠశాల నిర్వహిస్తున్నారు కదా.. అనాథల పిల్లల కోసం కూడా ఏదైనా చేయగలరేమో.. ఆలోచించండి అన్న మదర్‌థెరిస్సా మాటలతో చేతన సంస్థను ఏర్పాటు చేసి కొండరాళ్లు కొట్టి పొట్ట పోసుకుంటున్న కుటుంబాల పిల్లలను ఇంజనీర్లు, డాక్టర్లుగా డాక్టర్ మంగాదేవి మార్చారు. వందల మంది విద్యార్థులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు చెప్పే దేవాలయంగా చేతన పాఠశాలను మార్చారు.

15న శ్రీవారి కల్యాణోత్సవం

- వెంకటపాలెంలో హాజరుకానున్న సీఎం చంద్రబాబునాయుడు
- ఏర్పాట్లపై అధికారులతో చర్చించిన టీటీడీ ఈవో శ్యామలరావు



శ్రీవారి ధర్మ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్యామలరావు



వెంకటేశ్వరుడి కల్యాణోత్సవ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఈవో శ్యామలరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్

తుళ్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామం వెంకటపాలెంలోని టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం ఈ నెల 15న జరగనుంది. సీఎం చంద్రబాబు ఈ కల్యాణోత్సవానికి కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఆలయం ముందున్న ఆవరణలో కల్యాణోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్‌తో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థాన ఈవో శ్యామలరావు చర్చించారు. కల్యాణానికి 20 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు ఈవో శ్యామలరావు విలేకర్లకు చెప్పారు. భక్తులకు తాగునీరు, అన్న ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. కల్యాణం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం శ్రీవారి ధర్మ ప్రచార రథాన్ని ఈవో శ్యామలరావు జెండా ఊపి ప్రారంభించారు. శ్రీవారి ధర్మ రథాల ద్వారా రాజధానిలో ప్రచారం ప్రారంభించినట్లు చెప్పారు. కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. దేవాలయం వద్ద చేయాల్సిన ఏర్పాట్ల శుక్రవారం కలెక్టర్, ఎస్పీ అధికారులతో సమీక్షించారు. వీవీఐపీ, వీఐపీల రాకపోకల మార్గాలను, కల్యాణోత్సవ వేదిక, భక్తులు ఆశీనులయ్యే ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యదర్శి వినయ్‌చంద్, డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆర్డీఏవో శ్రీనివాసరావు, సీఆర్డీఏ, రెవెన్యూ అధికారులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశానికి వేళాయె

- ఉమ్మడి జిల్లాలో ఐదు విద్యాలయాలు
- బాలవాటిక (నర్సరీ) నుంచి 11వ తరగతి వరకు..
- ఈ నెల 21 అడ్మిషన్లుకు చివరి తేదీ

6

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (శనివారం)

సహరి : 5.04 (ఆదివారం)

మున్సిపాలిటీలకు.. షాక్



మునిసిపాల్టీ	నిధుల విడుదల
గుంటూరు	24,25,85,000
తెనాలి	5,25,92,000
చిలకలూరిపేట	4,73,72,000
మాచర్ల	2,05,58,000
సత్తెనపల్లి	1,94,45,000
వినుకొండ	2,05,92,000
పిడుగురాళ్ల	2,22,47,000
చీరాల	2,82,01,000
దాచేపల్లి	1,61,85,000
గురజాల	1,18,03,000

- ఆర్థిక సంఘం నిధులు నిలిపివేత
- ఎన్నికలు నిర్వహిస్తేనే నిధులని తేల్చేసిన కేంద్రం
- రూ.కోట్లలో నిధులను కోల్పోయిన ఏడు పురపాలక సంఘాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ఎన్నికలు నిర్వహించని, ఆస్తి పన్ను అసెస్మెంట్లలో ప్రగతిలేని మున్సిపాల్టీలకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిపివేసింది. పాలకవర్గం లేదనే కారణంతో నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి, రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీలు పెద్దఎత్తున నిధులను కోల్పోయాయి. ఆర్థిక సంఘం నిధులే ప్రధాన ఆదాయ వనరైనా ఆ నిధులు లేక పోవడంతో ఆయా పురపాలక సంఘాల్లో ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక సంస్థలను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏటా కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. అయితే పాలకవర్గాలు, ఆస్తి పన్ను అసెస్మెంట్ల పురోగతి ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధనను కేంద్రం విధించింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించని ఫలితంగా ఏడు మున్సిపాలిటీలకు నిధులు నిలిచిపోయాయి. 2023-24 ఆర్థికం సంవత్సరం రెండో విడతలో గుంటూరు కార్పొరేషన్ సహా తొమ్మిది మున్సిపాల్టీలకు రూ.48.10 కోట్లను కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. అయితే పాలకవర్గాలు లేని నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి మున్సిపాల్టీలకు, ఆస్తి పన్ను అసెస్మెంట్లలో ప్రగతి లేని రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీలకు ఆర్థిక సంఘం నిధులను కేంద్రం నిలిపివేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా అక్టోబరు, రెండో విడతగా ఫిబ్రవరిలో కేంద్రం నిధులు విడుదల చేసింది. అయితే ఈ ఏడు మున్సిపాల్టీలకు మాత్రం నిధులు జమ కాలేదు. నరసరావుపేటకు పొరుగున ఉన్న చిలకలూరిపేట మున్సిపాల్టీకి తాజాగా రూ.4.73 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇదే స్థాయిలో నరసరావుపేట సహా మిగిలిన మున్సిపాల్టీకి నిధులు సమకూరే వీలుండేది. ఆయా నిధులు సమకూరి ఉంటే పట్టణాల్లో చాలా వరకు రహదారులు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల కల్పన చేపట్టే అవకాశం ఉండేది. పాలకవర్గం లేదనే కారణంతో ఇప్పుడు ఈ నిధులు నిలిపేయడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆర్థిక సంఘం నిధులు నిలిపివేయడంతో ఎన్నికల నిర్వహణ అని వార్యమైంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తేనే ఆయా మున్సిపాలిటీల్లో ప్రగతి ముందడుగు వేసే అవకాశం ఉంటుంది.

ఆ మున్సిపాల్టీల్లో విచిత్ర పరిస్థితి

ఆర్థిక సంఘం నిధుల విడుదలకు ఉన్న నిబంధనల్లో పాలక వర్గాలు ఒకటైతే.. పురపాలక సంఘాల్లో ఉన్న అసెస్మెంట్ల పెరుగుదల కూడా మరో నిబంధన. ఏటా ఉన్న అసెస్మెంట్లలో 15 శాతం వృద్ధి ఉండాలి. అయితే రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీల్లో ఏటా అసెస్మెంట్ల వృద్ధి తక్కువగా ఉంది. దీంతో కేంద్రం ఈ మున్సిపాలిటీలకు రెండు విడతలుగా ఆర్థిక సంఘం నిధులను నిలిపేసింది.

వార్డుల పునర్విభజన తకరారు..

గతంలో నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు మున్సిపాల్టీల్లో పొరుగున ఉన్న పంచాయతీ లను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. ఈ ప్రక్రియలో అధికారులపై ఒత్తిడి తెచ్చి వైసీపీ నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్విభజన చేయించారు. వార్డుల విభజన సక్రమంగా జరగలేదని అభ్యంతరాలు వచ్చినా అధికారులు లక్ష్య పెట్టలేదు. ఫలితంగా బాధితులు కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయా మున్సిపాల్టీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. మంగళగిరి.. తాడేపల్లి మున్సిపాల్టీలను విలీనం చేసి గ్రేటర్ మంగళగిరిగా వైసీపీ ప్రభుత్వం మార్పు చేసింది. ఈ ప్రక్రియలో జరిగిన జాప్యం కారణంగా ఈ రెండు మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంలేదు. దీంతో ఇప్పటికే ఈ మున్సిపాలిటీలకు రెండు విడతల్లో ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగి పాలక వర్గాలు కొలువు దీరే వరకు ఆయా పురపాలక సంఘాలు ఆర్థిక సంఘం నిధులు కోల్పోనున్నాయి.

నాడు అరాచకాలు.. నేడు అక్రమాలు



హైకోర్టును బురిడీకొట్టించిన వ్యవహారంతో కలకలం


- అజ్ఞాతంలో బోరుగడ్డ.. ఇంటికి తాళాలు.. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్
- బెయిల్‌పై బయటవచ్చిన తర్వాత నకిలీ సర్టిఫికెట్ వెలుగులోకి ..

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాడు అరాచకాలతో బెంబేలెత్తించిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్.. నేడు అక్రమాలకు తెరలేపాడు. ప్రభుత్వం ఏదైనా.. అధికారంలో ఎవరున్నా సరే తగ్గేదేలేదంటున్నాడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా ప్రవర్తించిన బోరుగడ్డ ఆ తర్వాత కూడా తన నేర ప్రవృత్తిని కొనసాగిస్తూనే ఉన్నాడనేందుకు అనేక సంఘటనలు వెలుగుచూశాయి. పోలీస్‌స్టేషన్‌లో రాచమర్యాదలైనా.. కస్టడీలో పోలీసులతో కలసి రెస్టారెంట్‌లో విందు అయినా.. చివరకు న్యాయ వ్యవస్థకు సైతం సవాల్ విసిరి దర్జాగా బయట తిరుగుతున్నాడు. తల్లికి సీరియస్‌గా ఉందని అత్యవసరంగా చెన్నై అపోలో ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించాలని గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్ సృష్టించి హైకోర్టు నుంచి బెయిల్ పొడిగించుకుని అజ్ఞాతంలోకి వెళ్లిన వ్యవహారం కలకలం రేపు తోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంతో పోలీ సులు కంగుతిని ఇప్పుడు హడావుడి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు బోరుగడ్డ అనిల్ రాజ్యాంగేతర శక్తిగా రెచ్చిపోయాడు. అప్పటి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారిపై అసభ్య పదజాలం, దూషణలతో సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయాడు. ఎవరైనా ప్రశ్నిస్తే నేరుగా సీఐడీ అధికారులతో వారిని బెదిరించాడు. గడిచిన ఐదేళ్ల ప్రభుత్వ వ్యవస్థలన్నీ తన గుప్పెట్లో ఉన్నాయన్నట్లుగా ప్రవర్తిస్తూ అత్యంత హేయమైన భాషలో రెచ్చిపోయాడు. మహిళలు సిగ్గుతో తల దించుకునే విధంగా అసభ్యకరమైన పదజాలంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్‌స్టేషన్లలో బోరుగడ్డ అనిల్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గుంటూరులోని ఏఈఎల్సీ చర్చి ట్రెజరర్ బాబుప్రకాష్‌పై హత్యాయత్నం కేసులో బోరుగడ్డ అనిల్‌ను గత అక్టోబరు 15న అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో 14 కేసులు నమోదు కాగా పోలీసులు కోర్టులలో పిటి వారెంట్లు దాఖ లు చేసి సంబంధిత కోర్టుల్లో హాజరు పరిచారు. తాను కేంద్ర మంత్రి పీఏని అంటూ అనంతపురం జిల్లాకు చెందిన కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి చర్చి ఆస్తులు వివాదంలో తలదూర్చి బెది రింపులకు పాల్పడ్డాడు. ఆ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైల్లో గత అక్టోబరు నుంచి రిమాండ్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో అనేకసార్లు బెయిల్ కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. అయితే అనంత పురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో అక్కడ జిల్లా కోర్టు బోరుగడ్డ బెయిల్ తిరస్కరించింది. దీంతో గత ఫిబ్రవరి 14న హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నాడు. తన తల్లికి ఆరోగ్యం సరిగాలేదని వైద్యం చేయించాలని కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఫిబ్రవరి 28 సాయంత్రం వరకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఫిబ్రవరి 15న విడుదలయ్యాడు. హైకోర్టు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 28న రాజమండ్రి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ముందు లొంగిపోయాడు. అయితే తన తల్లి పద్మావతి ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుందని, ఆమెకు చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందించాలని గుంటూరులోని లలితా ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాఘవ శర్మ సిఫార్సు చేసినట్లు ఆయన లెటర్ హెడ్‌పై సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సృష్టించి కోర్టులో బెయిల్ పొడిగింపు కోసం దాఖలు చేశాడు. అది నిజమైనదేనని నమ్మిన హైకోర్టు ఆయనకు ఈ నెల 11 వరకు బెయిల్ మంజూరు చేసింది. 11న సాయంత్రం జైలు సూపరింటెండెంట్ ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. అయితే ఆయన దాఖలు చేసిన సర్టిఫికెట్‌పై ఎటువంటి సమాచారం లేదని పీపీ వాదించడంతో ఆ సర్టిఫికెట్ ప్రామాణికతపై విచారించాలని కోర్టు ఆదేశించింది. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత నకిలీ సర్టిఫికెట్ విషయం వెలుగుచూడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే ఇప్పటికే బోరుగడ్డ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చెన్నై అపోలో ఆస్పత్రిలో పోలీసులు విచారించగా ఈ నెల 3న బోరుగడ్డ పద్మావతి డిశ్చార్జ్ అయినట్లు తేలింది. అయితే ఆ తర్వాత నుంచి ఆమె గాని, బెయిల్‌పై బయటకు వచ్చిన ఆమె తనయుడు అనిల్ ఆచూకీగాని తెలియరాలేదని పోలీసులు అంటున్నారు. అనిల్ నకిలీ సర్టిఫికెట్ సృష్టించిన విషయం పక్కన పెడితే ఆయనకు హైకోర్టు ఈనెల 11 వరకు బెయిల్ పొడిగించింది. ఈలోపు కోర్టు నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాని పక్షంలో ఈ నెల 11 వరకు బోరుగడ్డ అనిల్ బయట తిరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు అతడి కదలికలను పసిగట్టేందుకు ప్రయత్నిస్తున్నా ఎటువంటి సమాచారం అందడం లేదు. గుంటూరు అమరావతిరోడ్డులోని వేళాంగణినగర్‌లోని బోరుగడ్డ అనిల్ ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి. ఆయన సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో ఆయన కదలికలు ప్రశ్నార్థకంగా మారాయి.

నేటి నుంచి అందుబాటులోకి మూడొంతెనల మార్గం

- ఆర్‌యూబీని ప్రారంభించనున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక డొంకరోడ్డులోని మూడొంతెనల రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) పనులు ఎట్టకేలకు పూర్తి అయ్యాయి. దీంతో శనివారం సాయంత్రం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈ బ్రిడ్జిని ప్రజానీకానికి అంకితం చేయనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దశాబ్దాల క్రితం నిర్మించిన మూడొంతెనల ఆర్‌యూబీ శిథిలావస్థకి చేరుకోవడంతో రైల్వే శాఖ దాని స్థానంలో ఆర్‌సీసీ బ్లాకులతో నూతనంగా ఆర్‌యూబీ నిర్మాణాన్ని గత ఏడాది నవంబరు నెలాఖరున చేపట్టింది. షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి అవుతాయనుకుంటున్న దశలో నగరపాలకసంస్థ కు చెందిన వాటర్ పైపులైను అడ్డుగా వచ్చింది. దీనిని తొలగించి ప్రత్యామ్నాయంగా వేరే పైపులైను నిర్మాణం చేయాల్సి వచ్చింది. దీని వల్ల అనుకున్న సమయానికంటే దాదాపుగా నెల ఆలస్యంగా పనులు పూర్తి అయ్యాయి. ఇంకా అరకొర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా డొంకరోడ్డు వైపున ఉన్న భవనాలను తొలగించాల్సి ఉన్నది. అయితే ప్రస్తుతానికి వాటి జోలికి పోకుండా ఆర్‌యూబీని అందుబాటులోకి తీసుకురావాలని అధికార యంత్రాంగం నిర్ణయిం చింది. అడ్డుగా ఉన్న భవనాలను తొలగించేంత వరకు డివైడర్ నిర్మాణం చేపట్టొద్దని నగర పాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు.



మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఈ రోడ్డు విస్తరణ చేపడతామని చెప్పారు. కాగా శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని ఈ ఆర్‌యూబీని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానితో ప్రారంభింప చేయాలని అధికారులు నిర్ణయించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీని వాసులు, డీఆర్ఎం రామకృష్ణ తదితరులు హాజరు కానున్నారని అధికారవర్గాలు తెలిపాయి.

జిల్లా మహిళా అధికారుల ట్రెక్కింగ్



నరసరావుపేట కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా అధికారిణులు వినూత్నంగా కోటప్పకొండపై శుక్రవారం ట్రెక్కింగ్ చేశారు. మహిళలు ఉత్సాహంగా కొండపైకి ఎక్కారు. వీరితో పాటు కలెక్టర్, ఎస్పీలు ట్రెక్కింగ్ చేశారు. ట్రెక్కింగ్ అనంతరం కొండపైకి చేరుకుని అందరూ విజయ చిహ్నాన్ని చూపించారు.

ఆరోగ్య శాఖలో 30 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్ , మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్, సెకండరీ హెల్త్ (విజయవాడ) ఆదేశాల ప్రకారం జిల్లాలో సెకండరీ హెల్త్ వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న 30 పోస్టులకు పొరుగు సేవల పద్ధతిలో పని చేసేందుకు వివిధ కేటగిరిల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి డాక్టర్ ఎం మజీదాబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలపారు. డెంటల్ టెక్నీషియన్ (ఒక పోస్టు), ల్యాబ్ టెక్నీషియన్ (రెండు పోస్టులు), ఎలక్ట్రిషియన్ (రెండు పోస్టులు), కౌన్సెలర్ (ఒక పోస్టు), జనరల్ డ్యూటీ అటెండెంట్ (13పోస్టులు), పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్ (మూడు పోస్టులు), థియేటర్ అసిస్టెంట్ (ఐదు పోస్టులు), ఆఫీస్ సబార్డినేట్ (మూడు పోస్టులు) భర్తీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 18వ తేదీలోపు గుంటూరు పట్టాభిపురంలోని జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి కార్యాలయానికి పంపాలని ఆమె కోరారు. తర్వాత అందే దరఖాస్తులను పరిశీలించబోమని డాక్టర్ మజీదాబీ వెల్లడించారు.

చెన్నై ఎక్స్‌ప్రెస్ ఇక చర్లపల్లి నుంచి

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని దశాబ్దాలుగా నిత్యం హైదరాబాద్ నుంచి చెన్నై సెంట్రల్‌కు, చెన్నై సెంట్రల్ నుంచి హైదరాబాద్‌కు గుంటూరు మీదుగా రాకపోకలు సాగిస్తున్న చెన్నై ఎక్స్‌ప్రెస్ టెర్మినల్‌ని రైల్వే శాఖ మార్పు చేసింది. ఇక నుంచి ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్‌కు సమీపంలో అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతుంది. శుక్రవారం బయలుదేరి నంబరు. 12603 చెన్నై సెంట్రల్ - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ శనివారం వేకువజామున 5.10కి చర్లపల్లి చేరుకొని ఆగిపోతుంది. అలానే నంబరు. 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ శనివారం నుంచి చర్లపల్లిలో సాయంత్రం 5.25కి బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 5.40కి చెన్నై సెంట్రల్‌కి చేరుకొంటుందని గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు.

యూనివర్సిటీకి మూడు పతకాలు

పెదకాకాని, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నేషనల్ యూత్ ఫెస్టివల్లో మెరిసింది. నోయిడాలోని అమిటి యూనివర్సిటీలో జరిగిన 38వ అంతర్ విశ్వవిద్యాలయాల నేషనల్ యూత్ ఫెస్టివల్ పోటీలలో మూడు పతకాలు సాధించి వర్సిటీ కీర్తిని రెట్టింపు చేసింది. మైమ్‌లో మూడో బహుమతి స్పాట్ ఫొటోగ్రఫీలో సాధించామని యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం వర్సిటీ యూత్ ఫెస్టివల్ జట్టును అభినందించారు. అలాగే జట్టు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా తర్ఫీదు ఇప్పించి కృషి చేసినందుకు కోఆర్డినేటర్ మురళీమోహన్‌ను అభినందించారు.

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశానికి వేళాయె

- ఉమ్మడి జిల్లాలో ఐదు కేవీలు
- బాలవాటిక (నర్సరీ) నుంచి 11వ తరగతి వరకు..
- ఈ నెల 21 అడ్మిషన్లుకు చివరి తేదీ



నల్లపాడు కేంద్రీయ విద్యాలయం

గుంటూరు (విద్య) మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లేని విద్యతోపాటు విద్యార్థుల సంపూర్ణ వికాసానికి అవకాశం కల్పించే క్రీడా, సాంస్కృతిక, సాంకేతిక, వైజ్ఞానిక, కళా రంగాల్లో నైపుణ్యాలను నేర్పిస్తూ చదువులో రాణించేలా విశేష కృషి చేసే విద్యాసంస్థల్లో కేంద్రీయ విద్యాలయాలు అగ్రస్థానంలో ఉంటాయి. వీటిల్లో ప్రవేశానికి కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ప్రాథమిక స్థాయిలో నర్సరీ (బాలవాటిక)తోపాటు ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు, రక్షణ రంగ సంస్థల్లో పనిచేసే తల్లిదండ్రుల పిల్లలకు ఎక్కువ అవకాశం ఉన్నా, సాధారణ ప్రజల పిల్లలే ఎక్కువ మంది ఈ విద్యాలయాల్లో చదువుతూ ఉంటారు.

జిల్లాలో ఎక్కడెక్కడ అంటే..

ఉమ్మడి జిల్లాలో గుంటూరు నగరానికి సమీపంలోని నల్లపాడు, తెనాలి, బాపట్ల, సత్తెనపల్లి సమీపంలోని ఇర్లపాడులో కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. గుంటూరు నగరానికి సమీపంలోని నల్లపాడులో రెండు షిఫ్టుల్లో పాఠశాల నిర్వహిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తారు. బాల వాటిక (ప్రీ ప్రైమరీ 1 ,2, 3)తో పాటు ఒకటో తరగతిలో ప్రవేశాలకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ప్రతి స్కూల్‌లో బాలవాటికలో 40 , 1వ తరగతిలో 40 సీట్లు ఉంటాయి. ఇతర తరగతుల్లో అందుబాటులో ఉన్న ఖాళీల ప్రకారం సీట్లు భర్తీ చేస్తారు.

వయోపరిమితి... రిజర్వేషన్లు

రిజర్వేషన్ ప్రకారం ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీ అభ్యర్థులకు 27 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తారు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితి కల్పిస్తారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్లు, ఇతర వివరాల కోసం https://kvsonlineadmission.kvs.gov.in అనే వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు చూడవచ్చునని నల్లపాడు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయకుమార్ తెలిపారు.

ఉజ్జీవం కోసం ప్రపంచమంతా ప్రార్థన





దైవ సందేశాన్ని వివరిస్తున్న అబ్రహం, ప్రార్థనలో విశ్వాసులు

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం మొత్తం నేడు ఉజ్జీవం కోసం ప్రార్థన చేస్తుందని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం అన్నారు. లేమల్లె గ్రామంలోని దయాక్షేత్రంలో జరుగుతున్న 48వ గుడారాల పండగ రెండో రోజు సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అబ్రహం ప్రభువు సందేశాన్ని విశ్వాసులకు అందించారు. ముందుగా పాస్టర్ ఫైడిపాల్, ప్రేమక్కలు తమ దైవజనులతో దేవుని పాటలు ఆలపించారు. అనంతరం అబ్రహం మాట్లాడుతూ ఉజ్జీవం అంటే తనను తాను ఉత్తేజం చేసుకుని, దేవుని కొరకు లెగవడం అన్నారు. దేశం, సంఘాలు, విశ్వాసి, సేవకుడు ఉజ్జీవింపబడాలి అని సంఘాలు ప్రార్థన చేస్తుంటాయని తెలిపారు. నిజమైన ఉజ్జీవమంటే దేవుని కోసం లేవాలి, ప్రార్థన చేయాలి, దేవుని మాట లేకపోతే బతకలేను, ఆయన్ను స్తుతించకుండా ఉండలేను అనే భావంతో మెలగాలి అని అన్నారు. ప్రజలకు రక్షణ కావాలి అనే సంకల్పం ఎప్పుడైతే ఏర్పడుతుందో దానిని ఉజ్జీవం అంటారని వివరించారు. అలా విశ్వాసులు అందరూ మెలగాలని సూచించారు. అనంతరం చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తన ప్రసంగాన్ని వినిపించారు. రెండో రోజు గుడారాల పండగకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది తరలివచ్చారు. విశ్వాసులు దేవునికి తెలిపిన స్తోత్రాలతో దయాక్షేత్రం మార్మోగింది.

ఆటో, ట్రాక్టర్ ఢీ: నలుగురికి గాయాలు

మండల పరిధిలోని లేమల్లె గ్రామం వద్ద ప్రయాణికులతో వస్తున్న ఆటోను, వాటర్ ట్యాంకర్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలైయ్యాయి. అమరావతిలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చి చికిత్స చేయించారు.

అన్ని రంగాల్లో సమానత్వం సాధించాలి

- డీఆర్ఎం ఎం.రామకృష్ణ



రైల్వేలో జరిగిన కార్యక్రమంలో డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో సాధికారత, సమానత్వం సాధించినప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ ఉద్యోగులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీఆర్ఎం మాట్లాడుతూ నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందుకొస్తున్నారని, ఇంకా కొన్నింటిలో సమానత్వం సాధించాల్సి ఉందన్నారు. పురుషులతో సమానంగా మహిళలను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, దక్షిణ మధ్య రైల్వే మహిళ ఉద్యోగుల సంఘం గుంటూరు డివిజన్ అధ్యక్షురాలు ఎం.ఆశ లత, సీనియర్ డీపీవో షాబాన్ హనూర్, సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ జేవీ అనూష, సీనియర్ డీఎఫ్ఎం బి.అమూల్యరాజ్, డీసీఎం ప్రదీప్ కుమార్, షర్మిల, ఏడీఎంవో డాక్టర్ సీహెచ్ సింధూ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేత శ్రీకాకుళం జట్టు



విజయం సాధించి ట్రోఫీ అందుకుంటున్న శ్రీకాకుళం జట్టు

గుంటూరు సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ లీగ్- 2025 పోటీలలో శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని స్టేడియంలో గత నాలుగు రోజులుగా జరిగిన క్రికెట్ లీగ్ శుక్రవారం ముగిసింది. ఫైనల్‌లో కృష్ణా, శ్రీకాకుళం జిల్లా జట్లు తలపడ్డాయి. 137/3 స్కోర్ సాధించిన శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. బహుమతులను ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎన్.రజని కుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఓ.నరసింహారావు మాట్లాడుతూ క్రికెట్ లీగ్-2025కు సహకరించిన సక్కు గ్రూపు, పద్మజా ల్యాబ్స్, హిందుస్థాన్ ఫార్మా, ఐకాన్ బయోలాజికల్స్, స్వస్తిక్ ఫార్మా, అక్షిన్ ఫార్మా, టీవీఎస్ లేబరేటరీస్, మల్లేశ్వరి ఆగ్రో ఏజెన్సీ, వర్షా గ్రూప్స్, ఇంటాస్ ఫార్మా, బోవి మని క్రైండ్, వెట్ ఇండియా, వెట్ ఫార్మా, డ్యూయల్స్ వెట్ క్లినిక్ సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బైక్‌పై విన్యాసాలు చేసిన వ్యక్తి కోసం పోలీసుల ఆరా



రింగ్‌రోడ్డులోని విద్యానగర్ మెయిన్‌రోడ్డుపై యువకుడి విన్యాసాలు

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్ మెయిన్ రోడ్డుపై శుక్రవారం ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేసిన ఘటనను పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ద్విచక్ర వాహనం ముందు చక్రాన్ని గాలిలోకి లేపి అతివేగంగా విన్యాసాలు చేస్తూ దూసుకెళ్లిన సంఘటనపై శుక్రవారం ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎస్పీ సీరియస్‌గా పరిగణించి ఆ యువకుడ్ని పట్టుకోవాలని ఆదేశించారు. దీంతో ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ బాబు ఆధ్వర్యంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేసిన యువకుడిని గుర్తించేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే రింగ్ రోడ్డులో ఉన్న సీసీ కెమెరాలు ద్విచక్ర వాహనం నంబరును గుర్తించే పరిస్థితి కనిపించలేదు. దీంతో ట్రాఫిక్ పోలీసులతో పాటు ట్రాన్స్‌పోర్టు అధికారులు సంయుక్తంగా సాంకేతిక పరిజ్ఞానంతో శుక్రవారం రాత్రి ఆ ద్విచక్ర వాహనం నంబరును గుర్తించారు. ఏటీ అగ్రహారం చిరునామా వచ్చింది. దీంతో శనివారం ఆ యువకుడిని అదుపులోకి తీసుకోనున్నారు. ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేసింది అతడే అని తేలితే అతనిపై చట్టపకారం కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

- జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గాదె వెంకటేశ్వరరావు, వీరేళ్ల

పెదకాకాని, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పెదకాకానిలోని మండల జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జరుగు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఆర్గనైజర్ సెక్రెటరీ మైలా శ్రీనివాసరావు (బుజ్జి), మండల అధ్యక్షుడు వీరెళ్ళ వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మండలనేని శ్రీను, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 525.20 అడుగులు ఉంది. ఇది 158.92 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8629 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 7840 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 26,572 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

అందరికీ సాగరమాత ఆశీస్సులు

- గోరంట్ల గురుశ్రీ జోసఫ్



దైవ సందేశం అందిస్తున్న జోసఫ్

మాచర్ల రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన సాగరమాత ఆశీస్సులు అందరికీ ఉంటాయని గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్ అన్నారు. విజయపురిసౌత్‌లోని సాగరమాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జోసఫ్ దివ్యపూజాబలి నిర్వహించి భక్తులకు దైవ సందేశం అందించారు. సాగరమాతను భక్తి విశ్వాసాలతో ప్రార్థిస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్నారు. ముందుగా ఉదయం 5.30 గంటలకు సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, 6.30 గంటలకు జోసఫ్ తంబిలు దివ్య పూజాబలి నిర్వహించారు. కొవ్వొత్తులతో తేరు ప్రదక్షణ గావించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. విజయపురిసౌత్ కమ్యూనిటీ వైద్యశాల డాక్టర్ కేపీ చారి, కొప్పునూరు పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. సంవృద్ధి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి ప్రారంభించారు. రాత్రి 8 గంటలకు సాగరమాత కళాకారుల బృందంచే యేసేపు చరిత్ర బుర్రకథ, 9 గంటలకు ధనవంతుడు బీదలాజరు బైబిల్ నాటకం ప్రదర్శించారు.

వైసీపీకి గూడూరు నానీ ముదిరాజ్ రాజీనామా



మాట్లాడుతున్న గూడూరు నాని ముదిరాజ్

గుంటూరు(తూర్పు), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని ముదిరాజ్ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బ్రాడీపేటలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ వాదాన్ని బీసీల్లోకి తీసుకెళ్లి 2019లో పార్టీ గెలుపు కోసం కృషి చేశామన్నారు. ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేయడం వల్లే 11 సీట్లకు మాత్రమే జగన్ పరిమితమయ్యారని చెప్పారు. వైసీపీ కారణంగా ఆర్థికంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18 లక్షల ముదిరాజ్ కోసం కమ్యూనిటీ భవనాన్ని ఏర్పాటు చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విడదల రజిని ఆర్థిక వనరులను దోచుకున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గోగు శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున ముదిరాజ్, దేవళ్ల వెంకట్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఎకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్స్ ప్రదర్శన, అమ్మకం

పెదకాకాని, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సీఎస్ ఆర్ విభాగం ద్వారా శిక్షణ పొందిన మహిళా పునరావాస కేంద్రం (జేఎమ్‌జే, శక్తి సదన్ ఉజ్వల హోమ్) మహిళలు తయారు చేసిన అనేక ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు వర్సిటీలోని డైక్‌మెన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు టీఎస్ఆర్ సంచాలకురాలు డాక్టర్ బి.బబిత శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్స్ ప్రదర్శన, అమ్మకం సమాచార కరపత్రాన్ని ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య జి. సింహాచలం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకురాలు రోజ్ రీనా, ఎమ్.రూప తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ముతో పరారైన ఉద్యోగి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న దాచేపల్లి సీఐ భాస్కరరావు, పక్కన ఎస్ఐ పాపారావు

దాచేపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో పింఛన్ సొమ్ముతో పరారైన వెల్ఫేర్ అసిస్టెంట్ సంపతి లక్ష్మీ ప్రసాదు శుక్రవారం దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సంపతి లక్ష్మీ ప్రసాదు ఈ నెల 1వ తేదీన పింఛన్లు అందజేస్తూ కొంత సొమ్ముతో కన్పించకుండా పోయాడు. ఫిబ్రవరి 28వ తేదీన బ్యాంక్ నుంచి రూ. 34.18 లక్షలు విత్ డ్రా చేశాడు. రూ.11,12,500 సొమ్ముతో పరారయ్యాడు. అనంతరం రెండు రోజుల క్రితం సచివాలయ ఉద్యోగి ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో మోస పోయానని, తనను క్షమించాల్సిందిగా తన కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నతాధికారులను వేడుకున్నాడు. ఈ సెల్ఫీ వీడియోపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఈ సంఘటనల అనంతరం శుక్రవారం దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ భాస్కరరావు పర్యవేక్షణలో ఎస్ఐ పాపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

వినుకొండటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా లారీ, ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపాలెం సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యర్రగొండపాలెం మండలం పాలుట్ల గ్రామం నుంచి 175 టిక్కీల మిర్చితో గుంటూరు వైపు వెళ్తున్న లారీ, గుంటూరు నుంచి త్రిపురాంతకం మండలం విశ్వనాథపురం వెళ్తున్న ఫోర్‌వీల్ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఫోర్‌వీల్ ఆటోలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన తొలుసూరి యల్లయ్య (31) అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరు వెళ్తున్న లారీలోని డ్రైవర్ జవహర్‌లాల్ నాయక్, లోకేశ్ నాయక్‌లకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకొని ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటోను పక్కకు తీసి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. యల్లయ్య మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ చౌర్యం కేసులో జైలు శిక్ష

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. విజిలెన్స్ అండ్ ట్రాన్స్‌కో సీఐ డి.వెంకన్న చౌదరి తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా, రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన వేల్పుల పెద్ద ఏసు గతంలో విద్యుత్తు చౌర్యానికి పాల్పడిన కేసులో జరిమానా చెల్లించాడు. అయినప్పటికీ మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడు. దీనిపై గుంటూరు ఏపీటీఎస్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైయింది. రెండో విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో అదనపు జిల్లా జడ్జి వీఏఎల్ సత్యవతి ఆర్నెల్లు జైలు శిక్ష లేదా రూ. 85 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

1,22,426 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 1,11,958 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,22,426 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,470 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	13800
నంబరు. 5	10000	13500
273	10000	13200
341	10500	14500
4884	10000	11000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10500	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	11500	12700
బ్యాడిగి 355	10500	13800
సింజెంటా బ్యాడిగి 5531	10500	12200
ఎన్ఎస్ 250		
బుల్లెట్	--	--
దేవనూరు డీలక్స్	10000	13300
ఆర్మూరు	10000	11500
తాలుకాయలు	5000	7500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

జన ఔషధి ద్వారా రెండు వేల రకాల మందులు

● ఔషధ శాఖ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ వెల్లడి



ఫార్మసిస్టును సన్మానిస్తున్న డైరెక్టర్ ప్రసాద్, డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ

గుంటూరు మెడికల్ , మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జన ఔషధి కేంద్రాల ద్వారా ప్రజలకు రెండు వేల రకాల మందులు, 300 రకాల వైద్య పరికరాలు చౌక ధరల్లో అందుబాట్లో ఉంచినట్లు ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ తెలిపారు. ఏడవ జన ఔషధి దివస్ వేడుకలు శ్యామలా నగర్‌లోని ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన (పీఎంబీజేపీ) ద్వారా ప్రజలకు నాణ్యమైన మందులను తక్కువ ధరలకే అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మీ మాట్లాడుతూ జన ఔషధి సురక్షితమని, సమర్థవం తంగా పని చేస్తాయన్నారు. ఉత్తమ సేవలు అందించిన జన ఔషధి కేం ద్రాలకు చెందిన మునగపాటి సుబ్బారావు(గుంటూరు), దివ్వెల ఏడు కొండలు (మంగళగిరి)లకు ఔషధ శాఖ డైరెక్టర్ ప్రసాద్ అవార్డులు ప్రదా నం చేశారు. కార్యక్రమంలో ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ గుంటూ రు డిప్యూటీ డైరెక్టర్ విజయశేఖర్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డి.లక్ష్మణ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌వీఎస్ పద్మ (గుంటూరుజోన్2), ఎన్.మహేష్ (గుంటూరు జోన్1), పి మంగమ్మ (తెనాలి), ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

రోగులకు కొత్త ఊపిరి పోస్తున్న...యూనిపోర్ట్ వాట్స్!

● రాష్ట్రంలో తొలిసారిగా కిమ్స్ శిఖర ఆసుపత్రిలో ప్రారంభం



మాట్లాడుతున్న ఖాజా మోయిన్ బేగ్ చిత్రంలో లక్ష్మీ, శ్రీదేవి, అనూష

గుంటూరు మెడికల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల్లో ఏర్పడే గడ్డలు, నీటి బుడగలు తొలగించడం క్లిష్టమైన శస్త్రచికిత్సతో చేసే ప్రక్రియ. రాష్ట్రంలో తొలిసారిగా ఇటువంటి రోగుల కోసం గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో మినిమల్లీ ఇన్‌వేజివ్ పద్ధతిలో నిర్వహించే యూనిపోర్ట్ వాట్స్ (వీడియో అసిస్టెడ్ థొరాసిక్ సర్జరీ) శస్త్రచికిత్సలను ప్రారంభించారు. ఊపిరిరాడక ఇబ్బందులు పడుతున్న ఇద్దరు రోగులు యూనిపోర్ట్ వాట్స్ పద్ధతిలో ఆపరేషన్ నిర్వహించి ఊపిరితిత్తుల్లో ఏర్పడిన గడ్డలను విజయవంతంగా తొలగించారు. ఇద్దరు కోలుకోవడంతో శుక్రవారం డిశ్చార్జీ చేశారు. కాకానిరోడ్‌లోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో విలేకరులకు ఈ ఆపరేషన్ వివరాలను చీఫ్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ ఖాజా అబ్దుల్ మోయిన్ బేగ్ వివరించారు. గుంటూరుకు చెందిన 60 ఏళ్ల వ్యక్తి కుడి వైపు ఊపిరితిత్తిలో గాలిబుడగ ఏర్పడి పగిలిపోవడంతో లంగ్ పూర్తిగా కుంచించుకుపోయినట్లు తెలిపారు. ఊపిరి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఈ రోజీకి యూనిపోర్ట్ వాట్స్ పద్ధతిలో ఛాతిపై కేవలం ఐదారు సెంటీమీటర్ల కోతతో లంగ్‌లో ఏర్పడిన గడ్డను తొలగించారు. మరో కేసులో విజయవాడకు చెందిన 38 ఏళ్ల గర్భిణీ ఎడమ ఊపిరితిత్తిలో ఏర్పడిన నీటి గడ్డ (బుల్లె) కారణంగా ఊపిరి అందక ఇబ్బందులు పడుతోంది. కిమ్స్‌లో చేరగా, సమస్యను గుర్తించిన వైద్యులు మినిమల్ ఇన్‌వేజివ్ పద్ధతిలో యూనిపోర్ట్ వాట్స్ పద్ధతిలో ఆపరేషన్ చేసి గడ్డ తొలగించారు. గతంలో ఈ తరహా ఆపరేషన్‌లు చేసేందుకు వైద్యులు ఆసక్తి చూపేవారు కాదని, కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు అందుబాట్లో ఉండటంతో ఈ తరహా ఆపరేషన్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు కిమ్స్ శిఖర హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు తెలిపారు. అన్ని రకాల ఊపిరితిత్తుల సమస్యలకు కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాట్లో ఉన్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో పల్మ్నాలజిస్టులు డాక్టర్ డీఎస్‌ఎస్‌వీ శ్రీదేవి, డాక్టర్ ఎం అనూష పాల్గొన్నారు.

టెక్నాలజీ సమాజానికి కొత్త అవకాశాలు అందిస్తోంది

● లాయిడ్ హెల్త్‌కేర్ అధ్యక్షుడు మహేష్‌కవథేకర్

గుంటూరు(విద్య), మార్చి 7(ఆంధ్రజ్యోతి):సాంకేతిక పరిజ్ఞానం సమాజానికి కొత్త అవకాశాలు అందిస్తుందని లాయిడ్ హెల్త్ కేర్ అధ్యక్షుడు మహేష్‌కవథేకర్ అన్నారు వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ నావిగేటింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విత్ టెక్నాలజీ అండ్ సస్టేనబులిటి అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మహేష్‌కవథేకర్ మాట్లాడుతూ ఎఐ, బిగ్‌డేటా ద్వారా వ్యాపార నిర్వహణ మరింత సమర్థవంతంగా చేయవచ్చునని అన్నారు. ఏఐ ఆధారిత సరఫరా వ్యవస్థతో ఖర్చు తగ్గించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, సీఈవో డాక్టర్ కూరపాటి మేఘన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కవథేకర్

అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న మహిళలు : జడ్పీ చైర్‌పర్సన్

గుంటూరు సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో మహిళల పాత్ర చాలా కీలకమైందని, వారు అన్ని రంగాల్లో ముందంజలో ఉండటం ఎంతో గర్వకారణంగా ఉందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పూర్వకాలం వివక్షకు గురై చదువుకు దూరమైన మహిళ నేటి సమాజంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ఉన్నారని చెప్పారు. వెనుకబడిన మహిళలను ఎదిగిన మహిళలు ప్రోత్సహించి పైకి తీసుకురావాలని చైర్‌పర్సన్ సూచించారు. అప్పుడే సమాజం ఇంకా ఎదుగుతుందన్నారు.

10న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

గుంటూరు(తూర్పు), మార్చి 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఈ నెల 10న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని డీఆర్వో షేక్ ఖాజావలీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో యధావిధిగా కొనసాగుతుందన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 7(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పాత గుంటూరు, సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవ కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికై 18న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



పరిశ్రమల శాఖ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ(డీఐఈపీసీ) సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లు ఏర్పాటుకు అనుకూలమైన భూములను పరిశ్రమలు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ వెంటనే గుర్తించాలన్నారు. సింగిల్ డెస్క్‌లో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సంబంధిత శాఖలు సక్రమంగా తనిఖీ చేసి పెండింగ్ లేకుండా నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పెండింగ్ దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో 49 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, పవర్ కాస్ట్ సబ్సిడీ రీయింబర్స్‌మెంట్‌లకు సంబంధించి రూ. 2,12,79,045 మంజూరు చేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, జిల్లా ఉప రవాణ కమిషనర్ సీతారామిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, జిల్లా భూగర్భజలవనరుల శాఖ డిప్యూటీ డైరక్టర్ వందనం, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ బీ హెచ్ మనోరమ, డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం వీ శివకుమార్, కార్మిక శాఖ సహాయక కమిషనరు కృష్ణవేణి, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నైపుణ్యాధికారి అధికారి సంజీవ్‌రావు, మార్కెటింగ్ శాఖ ఏడి రాజబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌పై పోస్టర్ల ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), మార్చి (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గుంటూరు రూరల్ మండలం ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను కలెక్టరేట్‌లోని ఆమె ఛాంబర్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ భార్గవ్ తేజ, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో షేక్ ఖాజావలి, డీపీవో సాయి కుమార్, రూరల్ మండల ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, విస్తరణ అధికారి కె.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, పీడీ విజయలక్ష్మి తదితరులు

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దిన వేడుకలను కలెక్టర్ కేటాయించిన విధుల మేరకు అందరూ సమన్వయంతో కృషి చేసి విజయవంతం చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో శనివారం జరగనున్న జిల్లా మహిళా దినోత్సవాల ఏర్పాట్లను డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జిల్లా సరఫరా అధికారి కోమలి పద్మ, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు, ఉపా సెల్ పీవో, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ నుంచి హాజరైన వారికి తాగునీటి సౌకర్యం, ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు.

బొంగరాలబీడులో డ్రెయినేజ్ సమస్యను పరిష్కరించాలి

గుంటూరు నగరంలోని బొంగరాలబీడులో డ్రెయిన్ బ్లాక్ అయి మురుగునీరు రోడ్లు, స్థానిక ఇళ్లల్లోకి వచ్చిందని, సదరు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. కమిషనర్ బొంగరాల బీడు నుంచి మురుగు వెళ్లే అవుట్ ఫాల్ డ్రెయిన్‌ని బుచ్చయ్యతోట వద్ద, రామిరెడ్డి నగర్, శ్రీనివాసరావుతోట, నల్లపాడు తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. నల్లపాడు మెయిన్‌రోడ్, రైల్వేస్టేషన్ రోడ్లలో జరుగుతున్న డ్రెయిన్, బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. పర్యటనలో కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, డీఈఈలు కల్యాణరావు, మధుసూదన్, సతీష్, శ్రీనివాస్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. చుట్టుగుంట సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ని జీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. క్యాంటీన్ వద్ద ఫ్లోర్ కుంగిన ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలని, కాంపౌండ్ వాల్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు.

నేడు, రేపు పని చేయనున్న జీఎంసీ క్యాష్ కౌంటర్లు

2024-25 సంవత్సరం ఆస్తి పన్ను బకాయిలను చెల్లించేందుకు మరో 3 వారాలు మాత్రమే గడువు ఉన్నందున పన్ను చెల్లింపుదారులకు వీలుగా రెండవ శనివారం, ఆదివారం శెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయని, పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటన ద్వారా కోరారు. కమిషనర్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ యధావిధిగా ఉంటుందన్నారు.

ఆలపాటిని సత్కరించిన ఎల్‌వీఆర్ క్లబ్ పాలకవర్గ సభ్యులు

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ అండ్ రీడింగ్ రూమ్ పాలక వర్గం సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి అభినందనలు తెలిపారు. క్లబ్ సభ్యుడైన ఆలపాటి రాజా పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించడం గర్వంగా ఉందన్నారు. పట్టభద్రుల సమస్యలను మండలిలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి యాగంటి దుర్గారావు, సంయుక్త కార్యదర్శి కొండ్రగుంట శ్రీనివాసరావు, కోశాధికారి యేల్చూరి వెంకటేశ్వర్లు, వులివర్తి వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఆలపాటిని సన్మానిస్తున్న ఎల్‌వీఆర్ క్లబ్ పాలక నేతలు

అలపాటిని అభినందించిన టీఎన్‌యూఎస్ నాయకులు

గుంటూరు(విద్య), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం అభినందించారు. రాష్ట్ర అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, కార్యదర్శి కె.వెంకటరావు, ఎం రామలింగయ్య, ఎన్‌వి జగదీష్‌కుమార్, పి శ్రీనివాసరావు, జె ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు పి.బాలస్వామి, పాలెటి శ్రీనివాసరావు, పి.జగదీష్‌బాబు, కోశాధికారి కె.శ్రీనివాసరెడ్డి, జివి శ్రీధర్, అంతోని బాబు, బాలాజీ నాయక్, అనిల్‌కుమార్,జె కిషోర్ పాల్గొన్నారు.

బదిలీలలో దివ్యాంగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో దివ్యాంగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టంలో ఉన్న అంశాలను పరిశీలించి 40 శాతం వైకల్యం ఉన్న ప్రతి దివ్యాంగ ఉపాధ్యాయులను ప్రాధాన్యత కేటగిరీలో చేర్చి బదిలీలు చేయాలన్నారు. 70 శాతం పైబడిన వారిని సాధారణ బదిలీల నుంచి మినహాయించాలని, ఒకవేళ వారు కోరుకుంటే మొదటి ప్రాధాన్యత వారికే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వెంకటేశ్వర్లు, శివ నాగేంద్ర, రమేష్, దుర్గారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగుల నిరసన

గుంటూరు(తూర్పు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని ఉద్యోగుల సంఘ ఐక్య వేదిక(యూఎఫ్ బీయూ) జిల్లా కన్వీనర్ సయ్యద్ చాంద్ బాషా డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికై శుక్రవారం స్థానిక చంద్రమౌళినగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాల యం ఎదుట ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24, 25 తేదిల్లో నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌బీఐ నాయకులు పరేంద్ర మాట్లాడుతూ ఐదు రోజుల పని దినాల్ని ప్రకటించాలన్నారు. ఐబీవోసీ నాయకులు రాంబాబు మాట్లాడుతూ ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీసే ప్రభుత్వ ప్రయత్నాలను విరమించుకోవాలని అన్నారు. నిరసనల్లో యూనియన్ సలహాదారుడు పి.కిషోర్ కుమార్, రామకృష్ణ, మురళీ, సాంబశివరావు, వేణు షరీఫ్, ప్రద్వీ, క్రాంతి, పావని, సునీత పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు ముందడుగు : ఎస్పీ

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఫిర్యాదుల విండోతో మహిళా సాధికారితకు ముందడుగు పడిందని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో మహిళా ఫిర్యాదుల విండో కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేక డెస్కుల ద్వారా మహిళా సిబ్బంది మహిళల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 'అబలకు అభయంతో ఆపన్న హస్తం' అందిస్తున్నట్లు ఎస్పీ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ట్రైనీ ఐపిఎస్ అధికారి దీక్షా పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో మహిళా ఫిర్యాదుల విండో అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మహిళల నుంచి 64 ఫిర్యాదులు అందగా వాటిలో 57 ఫిర్యాదులు పోలీస్‌స్టేషన్ల స్థాయిలో పరిష్కరించి, మిగిలిన 7 ఫిర్యాదులకు సంబంధించి ఆయా పోలీస్‌స్టేషన్‌లలో చట్ట ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

మహిళలు లక్ష్యాలను చేదిస్తూ ఆదర్శంగా నిలవాలి : ఏఎస్పీ



మహిళా సాధికారోత్సవాల్లో మాట్లాడుతోన్న అదనపు ఎస్పీలు సుప్రజ, హనుమంతు

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఎప్పుడూ ధైర్యంగా, స్వతంత్రంగా, ఉత్సాహంతో ఉంటూ తమ లక్ష్యాలను చేధిస్తూ అందరికి ఆదర్శంగా నిలవాలని క్రైమ్ అదనపు ఎస్పీ సుప్రజ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు ఆధ్వర్యంలో పోలీస్ ఆయుధాలకు సంబంధించి విద్యార్థినులకు అవగాహన కల్పించడం కోసం నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఆమె ప్రారం భించారు. మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు, పోలీస్ సిబ్బంది విద్యార్థినులకు ఆయా తుపాకులు, ఆయుధాల పనితీరు గురించి వివరించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలగం రామారావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి మహిళా సాధికారత ర్యాలీ నిర్వహించిన కొత్తపేట ఎస్సై రమేష్, పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాదవ హైస్కూల్ నందు విద్యార్థులకు జిల్లా పోలీస్ తరఫున చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

బ్రహ్మయ్య హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నాదెండ్ల బ్రహ్మయ్య హత్య కేసులో పక్షపాత వైఖరి విడనాడి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దళిత బహుజన ప్రజా సంఘాలు డిమాండ్ చేసాయి. బ్రహ్మయ్య ప్రథమ వర్ధంతి సభను దళిత బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవనంలో బహుజన పొలిటికల్ జేఏసీ నిర్వహించింది. బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాదు మాలాద్రి అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభను భీం సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం ప్రారంభించారు. బ్రహ్మయ్య హత్యకు గురై ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయకపోవడాన్ని వక్తలు తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ కేంద్రం రాష్ట్ర కన్వీనర్, హైకోర్టు అడ్వకేట్ వైకె, విరసం రాష్ట్ర నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.జె విద్యాసాగర్, బహుజన కెరటాలు వ్యవస్థాపకులు పల్నాటి శ్రీరాములు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పూరు నరసింహారావు, డీబీఎఫ్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్ కుమార్, బహుజన మహాసభ జాతీయ అధ్యక్షుడు జి.ఆర్.భగత్ సింగ్, జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, విసికె పార్టీ మహిళా అధ్యక్షురాలు కె జయసుధ తదితరులు ప్రసంగించారు.

ఆధార్ సేవలను ప్రజలకు చేరువ చేయాలి : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ్ తేజ

గుంటూరు(తూర్పు), మార్చి7(ఆంధ్ర జ్యోతి): ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ (డీఎల్‌ఏఎంసీ) సమావేశం జరిగింది. జిల్లా ఆధార్ సంబంధిత కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం భార్గవ్‌తేజ మాట్లాడుతూ ఆధార్ సేవలను వేగవంతం చేసేందుకు జిల్లా స్థాయిలో సమన్వయం చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు, అయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను టీడీపీ నాయకుడు తాళ్ల వెంకటేశ్ యాదవ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 20న జరగబోయే నామినేటెడ్ ఎమ్మెల్సీకి తన పేరు సూచించాలని కోరారు.

- గుంటూరు (ఆంధ్రజ్యోతి)



కేఎల్‌పీ స్కూల్ పూర్వ విద్యార్థిగా గర్వపడుతున్నా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



డాక్టర్ బసవపున్నయ్య, డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(విద్య), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు కోసం కేఎల్‌పీ స్కూల్ చేస్తున్న కృషి అభినందనీయమని, తాను పాఠశాల పూర్వ విద్యార్థిగా గర్వపడుతున్నానని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. రింగురోడ్డులోని కేఎల్‌పీ స్కూల్‌లో గురువారం రాత్రి జరిగిన 40వ వార్షికోత్సవాల్లో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు ఇక్కడ క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజంపై అవగాహన కల్పించేలా బోధన అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల కార్యదర్శి డాక్టర్ కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహాసంప్రోక్షణ సమేత మహా కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ముగిసాయి. చివరిరోజున మూల విరాట్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన ఉభయదేవేరి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులకు దంపతులకు సామూహిక కల్యాణం నిర్వహించారు. విశ్వగురు పీఠాధిపతులు శ్రీ విశ్వంజీ మహరాజ్, ఉత్తరకాశి శ్రీ సూర్యభాస్కరేంద్ర సరస్వతీస్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులు డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య, మాదల రత్నగిరిబాబు, కొర్రపాటి రామారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సభ్యులు హాజరయ్యారు.

వైద్యం.. సేవలో స్ఫూర్తి

● క్యాన్సర్ రహిత తెనాలి కోసం డాక్టర్ శారద కృషి


డాక్టర్ శారద


ఉచిత వైద్య శిబిరం వద్ద బారులుతీరిన జనం (ఫైల్)

తెనాలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన డాక్టర్ శారద అందరిలా వృత్తికే పరిమితం కాలేదు. 1993లో వైద్య వృత్తి చేపట్టిన ఆమె వృత్తిని వ్యాపారంగా కాకుండా సేవా స్ఫూర్తితో నిర్వహిస్తున్నారు. శారద సర్వీసెస్ సొసైటీని స్థాపించి అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మహిళగా సాటి మహిళల కష్టాలు తీర్చడానికి కృషి చేస్తున్నారు. కరోనా సమయంలో రోగుల ఇళ్లకే వెళ్లి వైద్యసేవలందించడం దగ్గర నుంచి మహిళకు వచ్చే సంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించడం, క్యాన్సర్ రహిత తెనాలిగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఉచితంగా మొక్కలనూ పంపిణీ చేస్తున్నారు. వారంవారం ఉచిత వైద్యసేవలతో పాటు రోగులకు మందులు కూడా అందిస్తున్నారు. కరోనా సమయంలో వైద్యులకు యాప్రాన్లు, మాస్కుల కొరత ఉండటంతో తెనాలిలోనే వాటిని తయారుచేయించి ప్రభుత్వానికి అందించారు. పీపీఈ కిట్లను రాష్ట్రంలోని అన్ని వైద్యశాలలకు అవకాశం ఉన్నంత వరకు ఆమె అందించగలిగారు. కరోనా రెండో దశలో రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్సలతో పాటు ఆక్సిజన్ కిట్లను కూడా అందజేశారు. కరోనా మహమ్మారి శాంతించాక మహిళల్లో సంక్రమణ వ్యాధుల నియంత్రణపై దృష్టి పెట్టారు. మహిళలల్లో సంక్రమణ వ్యాధులైన షుగర్, బీపీ, థైరాయిడ్, క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందడం ఎలా అనే విషయాలపై తెనాలిలోని పలు కాలనీలను దత్తత తీసుకుని చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారు. ప్రభుత్వ వైద్యశాల సహకారంతో మహిళలకు అవసరమైన పరీక్షలు, స్కానింగ్ చేయించగలిగారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి మహిళలను రక్షించేలా నడుం బిగించారు. తెనాలిలో శిబిరాల ద్వారా 3,600మందికి పాప్‌స్మియర్ పరీక్షలు ఉచితంగా చేయించారు. రూ.3200 ఖరీదయ్యే క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్లను ఆమె తన సొసైటీ ద్వారా ఉచితంగా 122 మంది రోగులకు అందించారు. ఆమె సేవలకు గుర్తుగా అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య వంటి ప్రముఖుల నుంచి ప్రశంసలు, పురస్కారాలు పొందారు. ఇంతటి సేవలందిస్తున్న డాక్టర్ శారద మిగిలిన వారికి స్ఫూరిదాయకమే.

అనాథల విద్యాలయంగా.. చేతన

● మదర్‌థెరిస్సా స్ఫూర్తితో డాక్టర్ మంగాదేవి


మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో మంగాదేవి

గుంటూరు(విద్య), మార్చి 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ నన్నపనేని మంగాదేవి.. అనాథ పిల్లలంటే అంతులేని ప్రేమ. వారికోసం ఏదైనా చేయాలనే సంకల్పం ఆమెది. ఆ సంకల్పానికి స్ఫూర్తి మదర్‌థెరిస్సా. యాభైనాలుగేళ్ల క్రితం 1970వ దశకంలో మదర్‌థెరిస్సా గుంటూరు బ్రాడీపేటలోని బాలకుటీర్‌ను సందర్శించారు. 'చిన్నారుల కోసం పాఠశాల నిర్వహిస్తున్నారు.. అనాథ పిల్లల కోసం కూడా ఏదైనా చేయగలరేమో ఆలోచించండి.. అని మదర్‌థెరిస్సా డాక్టర్ మంగాదేవికి సూచించారు. దీంతో 'చేతన' నిర్మాణానికి డాక్టర్ మంగాదేవి శ్రీకారం చుట్టారు. అనాథ పిల్లల కోసం చేతన ఆధ్వర్యంలో 1990 జూలైలో ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేశారు. వందల మంది విద్యార్థులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు చెప్పే దేవాలయంగా చేతనను మార్చారు. ఉచితవిద్య, వసతితోపాటు భోజనం, దుస్తులను ఇక్కడ అనాథ పిల్లలకు అందిస్తారు. 'చేతన'లో విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక, కళ, వైజ్ఞానిక రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతారు. చౌడవరం సమీపంలోని కొండరాళ్లు కొట్టి పొట్టపోసుకుంటున్న కుటుంబాల పిల్లలకు కూడా చేతన ద్వారా చేయూత ఇస్తున్నారు. చేతన అండతో వారంతా ఇంజనీర్లు, డాక్టర్లుగా మారి తమ కుటుంబాల్లో వెలుగులు నింపారు.

అన్నింటా.. ఆమె



● సేవ నుంచి సమరం వరకు సబలలు
● ఎందరికో స్ఫూరిగా మారి అద్భుతాలు సృష్టి

సగటు మహిళ.. అద్భుతాలు సృష్టిస్తోంది. అబల అని పక్కన పెట్టకుండా ప్రోత్సహిస్తే అందరికీ ఆదర్శప్రాయంగా, స్ఫూరిగా నిలుస్తామని మహిళలు నిరూపిస్తున్నారు. తమ నేపథ్యం పట్టణం.. మారుమూల పల్లె అన్న తేడా లేకుండా మహిళలు అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. కుటుంబాన్ని చక్కదిద్దు కోవడమే కాకుండా సమాజాన్ని కూడా సరి చేస్తున్నారు. ఇలాంటి ఎందరో మహిళలు ఉన్నారు. వారిలో కొందరి గురించి తెలుసుకుందాం..



సబలల సమరం

● చారిత్రాత్మక విజయంగా అమరావతి పోరు
● ఇంటి పని చేసుకుంటూనే ఐదేళ్లు ధీరోదాత్త పోరాటం

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు ఆ మహిళలు ఇళ్లకే పరిమితం. ఇళ్లలో లేదంటే వ్యవసాయ పనుల్లోనే నిమగ్నం. అలాంటి వారు ఆంధ్రుల కలల రాజధాని కోసం ఐదేళ్ల ధీరోదాత్త పోరాటం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆయువు కోల్పోయే దయనీయ స్థితి నుంచి అమరావతిని రక్షించుకున్నారు. పోలీసుల దౌర్జన్యాలు, లాఠీచార్జీలు.. కేసులు.. దాడులు.. అధికారం.. అవమానాలు.. కుట్రలెన్నింటినో ఎదుర్కొని ఐదేళ్ల పోరాటం చేసి అమరావతిని రాజధాని గ్రామాల మహిళలు అజరామరం చేశారు. సాధారణ గృహిణులుగా ఉండే మహిళలు ఉద్యమబాట పట్టి అసాధారణ వీర వనితలుగా ఎదిగారు. కుల, మతాలకు అతీతంగా సాగిన వారి పోరాటంతో నవ్యాంధ్ర కలల రాజధాని తిరిగి పునర్జీవం పోసుకుంది. ఎందరో వీరవనితలు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉద్యమానికి ఊపిరులూదారు. వారికి ప్రతీకలుగా ఒకరిద్దరి గురించి..

వెనకడుగు వేయలేదు



వెలగపూడి గ్రామానికి చెందిన షేక్ వహీదా రెహమాన్. రాజధాని కోసం ఎకరంన్నర పొలం ఇచ్చారు. దంపతులిద్దరూ ఉద్యమంలో ముందుండేవారు. కరోనా సోకి భర్త హిమాంసాహెబ్ చనిపోయారు. అయినా రెహమాన్ వెనకడుగు వేయలేదు. బిడ్డలను చదివించుకుంటూనే రాజధానిపై జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా రోడ్డెక్కారు. క్షేత్రస్థాయిలో మహిళలను కదిలించి ఉద్యమాన్ని పదునెక్కించారు. ఐదేళ్లపాటూ ఉద్యమాన్ని అగ్రపథాన నిలిపి కొనసాగించారు.

దళిత జేఏసీ నేతగా



తుళ్లూరు గ్రామానికి చెందిన అంకం సువర్ణ కమల దళిత మహిళ. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి ఉద్యమ నేతగా ఎదిగారు. అమరావతి దళిత జేఏసీ నేతగా ఎదిగారు. దళితవాడల్లో చైతన్యాన్ని రగుల్కొల్పి అమరావతి ఉద్యమ అగ్రభాగాన వారిని నిలపడంలో ఆమె కీలకంగా నిలిచారు. పాదయాత్రలో నడిచి తమ త్యాగాలను ప్రపంచానికి చాటారు.

ఎంతోమందికి స్ఫూర్తి



వెలగపూడికి చెందిన రైతు కూలీ రావి గంగాపార్వతి. రాజధాని కోసం ఇవ్వడానికి సెంటు భూమి కూడా లేని నిరుపేదరాలు. వయసులో పెద్దవారు కూడా. అయినా రాజధానిపై జరుగుతున్న కుట్రలతో చలించిపోయారు. భూములిచ్చిన రైతులు.. తనకు పని ఇచ్చిన అన్నదాతలకు జరుగుతున్న అన్యాయాన్ని తనకు జరుగుతున్న అన్యాయంగా భావించి ఆమె ఉద్యమంలోకి వచ్చారు. ఇలా వచ్చి అలా వెళ్లడం కాదు.. ఐదేళ్లపాటు ఉద్యమంలోనే కొనసాగారు. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు.

మహిళలను చైతన్యవంతం



తుళ్లూరు గ్రామానికి చెందిన అరుణ. ఆమె కటుంబం రాజధాని కోసం రెండెకరాలు పొలం ఇచ్చారు. రాజధానిపై జరిగిన కుట్రల నేపథ్యంలో ఆమె ఉద్యమంలోకి వచ్చారు. సాధారణ గృహిణిగా ఉన్న ఆమె ఉద్యమ ప్రభావంతో చైతన్యం పొందారు. ఎందరో మహిళలను చైతన్యవంతం చేసి ఉద్యమంలోకి తీసుకువచ్చారు.

నారీ సారథ్యం

● కీలకమైన 16 ప్రభుత్వ శాఖలకు నాయకత్వం

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంటూరు జిల్లాలో గతంలో ఎన్నడూలేనట్లుగా మహిళా అధికారులకు కీలక బాధ్యతలు లభించాయి. అమరావతి రాజధాని కలిగిన కీలకమైన గుంటూరు జిల్లా బాధ్యతలను మహిళా అధికారులైతేనే సమర్థవంతంగా నిర్వహిస్తారన్న భావనతో ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నది. పరిపాలనపరంగా జిల్లాను ముందుకు నడిపించే గుంటూరు జిల్లా కలెక్టర్ బాధ్యతను ఇంచుమించుగా రెండు దశాబ్దాల తర్వాత మహిళకు దక్కింది. కలెక్టర్‌గా ఎస్ నాగలక్ష్మి ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటూ అనేక అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా నిర్వహించి ప్రశంసలందుకున్నారు. జిల్లా లో వివిధ ప్రభుత్వ శాఖలకు మహిళా అధికారులే నాయకత్వం వహిస్తున్నారు. తెనాలి సబ్ కలెక్టర్‌గా వీ సంజనసిన్హా, గుంటూరు జిల్లా రిజిస్ట్రార్‌గా డీ శైలజ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీగా సుప్రజ, జిల్లా విద్యాశాఖ అధికారిగా రేణుక, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల మేనేజర్‌గా జయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా దుర్గాబాయి, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమశాఖ పీడీగా ఉమాదేవి, మెప్మా పీడీగా విజయలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారిగా కే మయూరి, ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చి వాణిజ్య కేంద్రమైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఉన్నతశ్రేణి కార్యదర్శిగా చంద్రిక, మార్కెటింగ్ శాఖ డీడీగా జాస్నీరాణి, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ ఏడీగా సువార్త, పౌరసరఫరాల శాఖ అధికారిగా కోమలి పద్మ, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌గా లక్ష్మితో పాటు మరికొన్ని శాఖలకు కూడా మహిళ అధికారులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రజాప్రతినిధులుగా..

ఉమ్మడి గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్‌గా కత్తెర హెనీక్రిస్టీనా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మూడు జిల్లాల ప్రజాప్రతినిదులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ఆమె జడ్పీని పురోభివృద్ధిలోకి తీసుకెళుతున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గల్లా మాధవిని గెలిపించిన టీడీపీ కూటమి అటు అధికారయంత్రాంగం, ఇటు పరిపాలనపరంగా మహిళలకు అగ్ర తాంబూలాన్ని ఇచ్చింది.

హెచ్‌ఐవీ బాధితులకు షిప్ బాసట

● 20 ఏళ్లుగా బాధితురాలు రమాదేవి ప్రస్థానం


ప్రశంసాపత్రం అందుకుంటున్న రమాదేవి

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోనే భర్త హెచ్‌ఐవీతో మృతి చెందగా.. బాధిత మహిళ అన్న కనికరం కూడా లేకుండా అయిన వాళ్ల అవమానాలు.. చీత్కారాలతో ఆమె కుంగిపోలేదు. వాటిని అధిగమించి.. బాధిత మహిళగా 20 ఏళ్లుగా హెచ్‌ఐవీ రోగుల సేవలో తరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అవమానాలనే సోపానాలుగా చేసుకుని తనలాంటి ఎందరికో అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఆమె పేరే.. 'షిప్ రమాదేవి'. హెచ్‌ఐవీ బాధితుల కోసం సొసైటీ వెల్ఫేర్ హెచ్‌ఐవీ ఇన్‌ఫెక్టెడ్ పీపుల్(ఎస్‌హెచ్‌ఐపీ- షిప్) సంస్థను ఏర్పాటు చేసి ఎందరో బాధితులకు అండగా నిలిచారు. అటు అత్తింటివారు.. ఇటు పుట్టింటివారు ఎవరూ ఆదరించని దయనీయ పరిస్థితిలో జీవితాన్ని సవాలుగా తీసుకున్న గుంటూరుకు చెందిన రమాదేవి 2003లో తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. తన గుర్తింపును ప్రపంచానికి పరిచయం చేసి తనలాంటి ఎంతోమంది బాధితులకు ఆమె గుండె ధైర్యంగా మారారు. హెచ్‌ఐవీ బాధిత మహిళలను సమాజం చిన్నచూపు చూడడాన్ని సవాలుగా స్వీకరించిన రమాదేవి బాధిత మహిళలను చేరదీసి వారికి అండగా నిలుస్తున్నారు. ఏడుగురు మహిళలతో ఏర్పాటు చేసిన షిప్ సొసైటీ నేడు 15వేల మందికి ఆసరాగా నిలిచే స్థాయికి ఎదిగింది. మహిళలు 7,287, పురుషులు 6,478, ట్రాన్స్ జెండర్లు 21 మంది, బాలురు 196, బాలికలు 172 మందికి షిప్ అండగా ఉంటోంది. హెచ్‌ఐవీ అనేది బీపీ, సుగర్‌లాంటి దీర్ఘకాలిక అనారోగ్యమే తప్ప.. ఆందోళన పడాల్సింది ఏమీ లేదని.. దాన్ని చైతన్యంతో జయించవచ్చని నిరూపించి సమాజానికి ఒక పాఠం నేర్పింది. సొంత కుటుంబాల నుంచి ఎదురయ్యే అవమానాలను ఎదుర్కొనే చైతన్యాన్ని బాధిత మహిళలకు వేల సంఖ్యలో కౌన్సెలింగ్‌లు నిర్వహించారు. వంశ పారంపర్యంగా వారికి హక్కుగా రావాల్సిన ప్రయోజనాలను కూడా కుటుంబ సభ్యులు కాదు పొమ్మంటే.. ఆ హక్కుల సాధనకు వారికి చేయూతగా నిలిచారు. హెచ్‌ఐవీని ఎదుర్కొన్న వారి జీవిత కాలాన్ని పెంపొందించేందుకు కావాల్సిన వైద్య సహాయాన్ని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా అందిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్, మంగళగిరి, గోరంట్ల ఐడీహెచ్‌సీలో ఉన్న ఏంటీ రిట్రోవైరల్ థెరపీ(ఏఆర్టీ) సెంటర్లతో కలిసి వైద్య సదుపాయాలు బాధితులకు అందుబాటులోకి తెస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ కార్యక్రమాలతో అనుసంధానం చేసుకుని బాధితులకు అనేక రూపాల్లో అండదండలు అందించడంతోపాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ వస్తున్నారు. ఆమె స్ఫూర్తితో 26 జిల్లాల్లో హెచ్‌ఐవీ బాధితులకు అండగా నిలిచే ఇలాంటి సొసైటీలు ఎన్నో ఏర్పడ్డాయి. ప్రభుత్వ సంస్థలు, ఆశ గ్రూపులతో కలిసి బాధిత చిన్నారులను గుర్తించడం, వారికి కావాల్సిన ప్రయోజనాలను అందించడం కోసం షిప్ కృషి చేస్తోంది. హెచ్‌ఐవీ బాధితులు సమాజానికి సమస్య కాదు.. వారే ఈ సమస్యకు పరిష్కారం అన్న మోటివ్‌తో పనిచేసే 'షిప్' రెండు దశాబ్దాల ప్రస్థానంలో రమాదేవి, షిప్ సంస్థకు ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయి.

బెస్ట్ ఫిషర్‌గా అనంత విజయ

● బెస్తపాలెం నుంచి ఎదిగిన పారిశ్రామికవేత్త



మహిళా పారిశ్రామిక వేత్త అనంతవిజయకు బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు అందజేస్తున్న మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు (ఫైల్‌ఫొటో)

బాపట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దేశంలో 462 హేచరీలు ఉన్నాయి. అయితే ఓ మహిళ ఆధ్వర్యంలోనూ హేచరీలు ఉన్నాయంటే ఆశ్చర్య పోవాల్సింది. అయితే అందరినీ ఆశ్చర్య పరచడమే కాకుండా ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.. బాపట్ల పట్టణంలోని బెస్తపాలేనికి చెందిన మత్స్యకార మహిళ అనంత విజయ. మత్స్యకార కుటుంబంలో పుట్టిన ఆమె ఆక్వా పరిశ్రమలో రాణిస్తున్న తీరు ఎందరికో ఆదర్శప్రాయంగా మారింది. బాపట్ల మండలం ధరివాదకొత్తపాలెంలో లక్షిత బయో రిసోర్సెస్, అన్నవరంలో లాలిత్య హెచరీస్ పరిశ్రమలను ఆమె నిర్వహిస్తున్నారు. హెచరీలో వనామి రొయ్యపిల్లలను ఉత్పత్తి చేస్తుండగా బయో రిసోర్సెస్ మందు ఫిష్ బ్రీడింగ్, అలంకరణ చేపల బ్రీడింగ్ తయారు చేస్తున్నారు. వీటి ద్వారా అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఏడాదికి రూ.1.8 కోట్ల టర్నవర్ చేస్తున్నారు. బాపట్లలో స్కిల్ కాలేజి నిర్వహిస్తూ యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కూడా ఆమె కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో అలంకరణ చేపల బ్రీడింగ్‌ను మలేషియా, సింగపూర్, అమెరికా వంటి దేశాలకు పంపించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆమె ప్రతిభను గుర్తించి ఇటీవల ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు ఇచ్చారు. న్యూఢిల్లీకి చెందిన ఆలిండియా ఫిషర్మెన్ మెగా కన్వెన్షన్ కానిస్టిట్యూషనల్ క్లబ్ బెస్ట్ ఫిసర్ ఉమెన్ ఎంటర్‌ప్రైజర్ అవార్డుతో సత్కరించింది.

ఇస్రోను చూద్దాం రండి!



● తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆహ్వానం
● యువ విజ్ఞాన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రోత్సాహం
● ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలి
● అన్ని వసతులు ఉచితమే..

గుంటూరు (విద్య), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో 9వ తరగతి విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన, ఆసక్తి పెంపొందించేందుకు, భవిష్యత్తులో వారు అంతరిక్ష పరిశోధనల వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రత్యేక కార్యక్రమం 'యు.వి.కా' నిర్వహిస్తుంది. ఇస్రో నిర్వహించే యువ విజ్ఞాన కార్యక్రమం (యు.వి.కా)లో పాల్గొనేలా ప్రోత్సహిస్తూ దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. యు.వి.కా. కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటికే ఇస్రో పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ఆహ్వానాలు పంపింది. విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు, డీఈవో, డీవైఈవో, ఎంఈవో, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్‌కు సమాచారం పంపింది. 9వ తరగతి విద్యార్థులు ఇందులో పాల్గొనేలా ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో దాదాపు 90వేల మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో ప్రతిభావంతులను ఎంపిక చేసి కార్యక్రమం ఇస్రో చేపడుతుంది.

ఎలా పాల్గొనాలి....

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న 9వ తరగతి విద్యార్థులు ఈ నెల 23 లోగా www.isro.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తులు పంపాలి. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఏప్రిల్ 7వ తేదీలోగా ఇస్రో ప్రకటిస్తుంది. మే 19 నుంచి 30వ తేదీ వరకు యు.వి.కా కార్యక్రమం ఉంటుంది. మే 31న కార్యక్రమం ముగుస్తుంది.

ఎక్కడెక్కడ నిర్వహిస్తారు..

యు.వి.కా కార్యక్రమాలు ఇస్రో ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా శ్రీహరికోటతోపాటు దేశంలోని ఏడు కేంద్రాల్లో నిర్వహిస్తారు. డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), బెంగళూరు (కర్ణాటక), షిల్లాంగ్ (మేఘాలయ), హైదరాబాద్ (తెలంగాణ), అహ్మదాబాద్ (గుజరాత్) తదితర ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

వీరికి ప్రాధాన్యం..

ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కార్పొరేట్ స్కూల్లో 9వ తరగతి చదివే విద్యార్థుల్లో అత్యంత ప్రతిభావంతులైన వారికి, అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి ఉన్నవారిని ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా ఎనిమిదో తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కులకు 50 శాతం, గ్రామీణ విద్యార్థులకు 15 శాతం, సైన్స్ ప్రదర్శనలో ప్రతిభచూపిన వారికి 10శాతం వెయిటేజ్ ఇస్తారు. ఇంకా క్రీడలు, ఒలింపియాడ్, ఎన్‌సీసీ, స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు ఐదు శాతం వెయిటేజీ కల్పిస్తుంది.

రవాణా, వసతి, భోజనం ఉచితమే..

ఎంపికైన విద్యార్థులను ఇస్రో కేంద్రాలకు తీసుకెళ్తారు. అక్కడ శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడే అవకాశం కల్పిస్తారు. తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా ఏర్పాటు చేస్తారు. అంతేకాకుండా ఇస్రోలో వింతలు, విశేషాలు తెలియజేయడంతోపాటు రాకెట్ ప్రయోగాలు, వాటి పనితీరు, వాటి వలన సమాజానికి కలిగే ఉపయోగాలు తదితర విషయాలను వివరిస్తారు. ప్రయాణ, భోజనం, ఇతర అన్ని సౌకర్యాలను ఇస్రో ఉచితంగానే కల్పిస్తుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సీవీ రేణుక, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా విజ్ఞప్తి చేస్తున్నారు.

క్షేత్ర పాలకుడే వాహనుడై...


హనుమంత వాహనంపై గ్రామోత్సవానికి విచ్చేసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు



● శ్రీవారి వాహన సేవలు ప్రారంభం

మంగళగిరి సిటీ, మార్చి 7: వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు శుక్రవారం రాత్రి హనుమంత వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. శ్రీవారి ప్రధాన వాహన సేవలు శుక్రవారం నుంచి ఆరంభమయ్యాయి. మంగళగిరికి క్షేత్ర పాలకునిగా చెప్పబడుచున్న భక్తాగ్రేశ్వరుడైన హనుమంతునికి స్వామివారి వాహన సేవల్లో తొలి ప్రాధాన్యతను కల్పించారు. అభయ ప్రదాన అయిన హనుమంతుని భుజ స్కందములపై శ్రీదేవీ, భూదేవీ సమేతుడైన శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు గ్రామోత్సవానికి విచ్చేసి భక్తులను అలరించారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరును చేరుకుని తిరిగి అదే మార్గంలో ఆలయానికి విచ్చేసింది. భక్తులు టెంకాయలు సమర్పించి స్వామివారిని శరణు వేడారు. ఈ ఉత్సవానికి పెదపాలెం వాస్తవ్యులు వాసిరెడ్డి మల్లేశ్వరరావు (రాజేష్) కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.రామకోటి రెడ్డి, అర్చకస్వాములు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళా వేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని ధర్నా

మంగళగిరి సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో కామన్ పీజీ ప్రవేశ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరిలోని ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ గత ప్రభుత్వం పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ విధానం తీసుకురావడంతో విశ్వవిద్యాలయాల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కామన్ పీజీ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్షను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కామన్ సెట్ వలన విద్యార్థులు తమకు ఇష్టమైన విశ్వవిద్యాలయాల్లో చేరలేక, వేరే జిల్లాల్లో సీటు వస్తే అక్కడకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జీవో నెంబర్ 77 తీసుకురావడం వలన కేవలం ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని, దీనివలన ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని కామన్ పీజీ ప్రవేశ పరీక్షల విధానాన్ని రద్దుచేయాలని, డిగ్రీ ఆన్‌లైన్ విద్యావిధానం, జీవో నెం.77ను రద్దు చేయాలని, ఖాళీగా వున్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు మస్తాన్, నాగభూషణం, ఉపాధ్యక్షుడు సాయికుమార్, యశ్వంత్ శివ, సాదిక్‌బాబు, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

తాడేపల్లి టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని పీఠాపురంలో ఈ నెల 14న నిర్వహించే జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనసేన నేతలు అంబటి తిరుపతిరావు, జొన్నా రాజేష్, చవ్వాకుల కోటేష్ బాబు పిలుపునిచ్చారు. తాడేపల్లి పార్టీ కార్యాలయంలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు.

పశ్చిమడెల్టా కాల్వకు నీరు

దుగ్గిరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1616 క్యూసెక్కుల సాగు నీటిని శుక్రవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 140 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 190, పశ్చిమ కాల్వకు 122, నిజాంపట్నంకాల్వకు 65, కొమ్మమూరుకాల్వకు 130 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పసుపు ధరలు

దుగ్గిరాల, మార్చి 7: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 229 బస్తాల పసుపును రైతులు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8,000, గరిష్ఠధర రూ.9,800, మోడల్ ధర రూ.9,400 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 8,000, గరిష్ఠ ధర రూ.9,800, మోడల్‌ధర రూ.9,400 పలికాయి.

సీఎం సహాయనిధి అందజేత

తాడేపల్లి (వడ్డేశ్వరం), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన బచ్చల బాలరాజుకు కాలులో నరాలకు సంబంధించిన వ్యాధితో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి నారా లోకేశ్ దృష్టికి టీడీపీ సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదనరావు, ఈపూరి కోటయ్య తీసుకువెళ్లారు. స్పందించిన మంత్రి లోకేశ్ సీఎం సహాయ నిధి నుంచి రూ. లక్ష విడుదల చేస్తూ ఎల్‌వోసీ ఇచ్చారు. ఆ ఎల్‌వోసీని కాట్రగడ్డ మధుసూదనరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, నేతలు నాగుర్‌వలి, భీముడు, శ్రీనివాసరావు, బాబూరావులు బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు టీడీపీ నేతలు, లోకేశ్, సీఎం చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్షయ వ్యాధి నివారణకు కృషి

పెదనందిపాడు, మార్చి 7: క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో సందర్శించారు. రాజుపాలెం గ్రామాన్ని టీడీ ముక్త్ విలేజ్‌గా ప్రకటించిన నేపథ్యంలో టీబీ నివారణ గురించి చర్చించారు. టీబీ అనుమానిత లక్షణాలు కలిగిన వ్యక్తులను పరీక్షలు చేయించి మందులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ త్రివేణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

తాడేపల్లి (ప్రాతూరు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాతూరు గ్రామానికి చెందిన కళ్లం వెంకటరెడ్డి గత సోమవారం ఐదు ఎకరాల గడ్డివామును తన ఇంటి వద్ద వేయించుకున్నారు. శుక్రవారం వాముకు తూర్పు వైపున ఉన్న కొబ్బరిచెట్టు కొమ్మలు నరుకుతుండగా ఆ కొమ్మలు సమీపంలో ఉన్న విద్యుత్ హైటెన్షన్ వైర్లపై పడి నిప్పులు చెలరేగి గడ్డివాము మీద పడడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. వెంటనే మంగళగిరి ఫైర్ స్టేషన్‌కి సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.95 వేల ఆస్తి నష్టం జరిగి వుండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వీఆర్వో అధికారి కొల్లి దుర్గా రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి తహసీల్దార్ సీతారామయ్యకు సమాచారం అందజేశారు.

సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి ఆటోనగర్‌లోని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ఆశా వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆ శాఖ కమిషనర్ జీ.వీరపాండ్యన్‌కు వినతిపత్రం అందజేశారు. సుబయ్య మాట్లాడుతూ ఏఎన్ఎంలు చేయవలసిన పనులను కూడా ఆశా వర్కర్లు చేస్తూ మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు మూడు అవకాశాలను కల్పించడం పట్ల సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు జీ.వేణుగోపాల్, చంద్రామణి, రాజ్యలక్ష్మీ, మల్లేశ్వరీ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఎక్కిన బోటు

తాడేపల్లి (కొలనుకొండ), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సముద్రంలోనో.. నదుల్లోనో.. తిరగాల్సిన పడవ ఇదేంటి... రోడ్డునపడి లారీ ఎక్కిందంటూ ఆశ్చర్యపడకండి. నదుల నుంచి ఇసుక రవాణాకు వినియోగించే ఈ బోటును నెల్లూరు నుంచి రాజమండ్రికి తరలిస్తున్నట్టు డ్రైవర్ తెలిపాడు. శుక్రవారం తాడేపల్లి మండలం కొలనుకొండ బైపాస్ వద్ద లారీపై ఈ బోటును ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా నెమ్మదిగా తీసుకెళుతుండగా ప్రజల కంటపడింది.


లారీపై బోటును తీసుకెళుతున్న దృశ్యం

పెదవడ్లపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి



నిర్మాణ పనులు పూర్తిచేసుకున్న పెదవడ్లపూడి ఎత్తిపోతల పథకం వద్ద ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు

- వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పథకం
- మంత్రి లోకేశ్ చొరవతో శరవేగంగా పనులు
- ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు
- త్వరలో లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

మంగళగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పెదవడ్లపూడి హైలెవల్ కెనాల్ ఎత్తిపోతల పథకం త్వరలో రైతులకు అందుబాటులోకి రానుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.9 కోట్లతో 70 శాతం పనులను పూర్తి చేయగా, అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు నిలిచిపోవడంతో ఐదేళ్ల పాటు రైతులు ఆర్థికంగా ఎంతో నష్ట పోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాఆగానే ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులను పూర్తిచేస్తామని మంత్రి లోకేశ్ ఎన్నికల ముందు రైతులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కేవలం ఆర్నెల్ల వ్యవధిలోనే ఎత్తిపోతల పథకం తాలూకా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయించారు.

హామీని నిలబెట్టుకున్న మంత్రి లోకేశ్..

2018లో రూ.9కోట్ల అంచనాతో పనులను ప్రారంభించగా, ఇప్పుడు ఆ అంచనా రూ.14.88 కోట్లకు చేరినప్పటికీ మంత్రి లోకేశ్ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఏపీ నీటి పారుదల అభివృద్ధి సంస్థ నుంచి త్వరితగతిన నిధులు మంజూరు చేయించి పథకం పనులను పూర్తి చేశారు. ఎత్తిపోతల పథకం వద్ద శుక్రవారం అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. మోటార్లు, పంపుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ వెంకటరత్నం మాట్లాడుతూ త్వరలో మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తికావడంతో మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల పరిధిలో 15 గ్రామాల్లోని 25,344 ఎకరాలకు మేలు జరుగనుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈ అనిల్‌కుమార్, జేఈ సుభాషిణి, ఐడీసీ ఏఈ గోపీచంద్ పాల్గొన్నారు.


ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన అధికారులు, కూటమి నేతలు

గమ్యం చేరే వరకు పయనం ఆపొద్దు


మంచు మనోజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తదితరులు

- సినీనటులు మంచు మనోజ్
- ఎన్నారై కళాశాలలో సరితం 2కె25 టెక్నో ఫెస్ట్
- హాజరైన కళాశాల కరస్పాండెంట్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్
- నేడూ కొనసాగనున్న ఫెస్ట్

మేడికొండూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గమ్యం చేరే వరకు పయనం ఆపొద్దని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఎదిరించి ముందుకసాగుతూనే ఉండాలని సినీ నటులు మంచు మనోజ్ విద్యార్థులకు సూచించారు. మేడికొండూరు మండలం విశదల అడ్డరోడ్డులోని ఎన్నారై కళాశాలలో సరితం (టెక్నో, స్పోర్ట్స్, కల్చరల్ ఫెస్ట్) 2కె25 టెక్నో ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా మనోజ్ హాజరయ్యారు. మనోజ్ విద్యార్థులతో మాట్లాడుతూ తాను మిమ్మల్ని మోటివేట్ చేయడానికి రాలేదని, ఎవరిని వారే మోటివేట్ చేసుకోవాలని సూచించారు. చేయని తప్పులకు ఎన్ని అవాంతరాలు వచ్చినా తలదించవద్దన్నారు. మీఅభిమానంతో, దేవుని ఆశీస్సులతో తాను నటిస్తున్న సినిమాలు త్వరలో విడుదల కానున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఆటపాటలతో పాటు చదువులోనూ రాణించాలన్నారు. మనం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరటానికి ఉన్న గమ్యాన్ని మరిచిపోకూడదని అన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి, వారిలో ఉన్న పరిజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా చేయడమే ఈ టెక్నికల్ ఫెస్ట్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దీనిలో పాల్గొనే విద్యార్థులు సాంస్కృతిక, ఆటల పోటీల్లో తమ ప్రతిభను కనపరచాలని, వారికి సుమారుగా రూ.5 లక్షల వరకు ప్రైజ్ మనీ ప్రకటించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుర్రా శరత్ చంద్ర, ప్రాస మణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు, ఏవో బండారు సీతారామయ్య, హెచ్‌ఓడిలు డాక్టర్ చంద్రమౌళి, రాము, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టెక్నికల్ ఫెస్ట్ : ఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో టెక్నికల్ ఫెస్ట్ ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థులు కోలాహలంగా ఆటల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సరితం(టెక్నో, స్పోర్ట్స్, కల్చరల్ ఫెస్ట్) 2కె25 టెక్నో ఫెస్ట్ పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన ఈ టెక్నికల్ ఫెస్ట్‌కు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలోని అన్ని కళాశాలకు ఆహ్వానం పంపించామన్నారు. అందులో సుమారు 35 కళాశాల నుంచి క్రీడాకారులు, టెక్నికల్ ఈవెంట్ లో పాల్గొనడానికి తమ పేర్లను నమోదు చేసుకున్నారని, కళాశాల ప్రిన్సిపల్ కోట శ్రీనివాసు తెలిపారు. శనివారం కూడా ఫెస్ట్ కొనసాగుతుందన్నారు.

కేఎల్‌యూలో ఘనంగా సురభి వేడుకలు

- హాజరైన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్, ప్రముఖ చిత్ర దర్శకులు కరుణ కుమార్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఎల్ వైస్‌చాన్సలర్ డాక్టర్ పార్థసారధి వర్మ తదితరులు

తాడేపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ప్రతి యేటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సురభి వేడుకలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వేడుకలకు ఏపీ పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్, ప్రముఖ చిత్ర దర్శకులు కరుణ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐఏఎస్ అధికారి సౌరబ్ మాట్లాడుతూ విద్యార్థి దశ ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో విలువైందన్నారు. ప్రతి విద్యార్థి సృజనాత్మకత కలిగి ఆలోచిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పారు. నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పార్థసారధివర్మ మాట్లాడుతూ కేఎల్ వర్సిటీ స్టూడెంట్ యాక్టివిటీ సెంటరులో 43 క్లబ్‌లు వున్నాయన్నారు. ఆయా క్లబ్‌ల ద్వారా విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు వినూత్న ప్రయోగాలను చేయిస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో స్టూడెంట్ యాక్టివిటీ కార్యకలాపాలను విస్తృతం చేయనున్నామని వెల్లడించారు. అనంతరం 2023-24 విద్యా సంవత్సరంలో విద్య, క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ఉత్తమ అధ్యాపకులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేఎల్‌యూ ప్రోచాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ప్రోవైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కే.రాజశేఖర్‌రావు, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ కే.సుబ్బారావు, సురభి చైర్‌పర్సన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, కన్వీనర్ సాయి విజయ్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, తదితరులు

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- మలినేనిలో ఘనంగా టెక్నో కల్చర్ స్పోర్ట్స్ ఫెస్ట్

వట్టిచెరుకూరు, మార్చి7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వైఫల్యాలకు కుంగి పోకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగినప్పుడే లక్ష్యాన్నిచేరుకోగలుగుతారని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సంస్కృతి - 2025 నేషనల్ లెవల్ టెక్నో కల్చర్ స్పోర్ట్స్ ఫెస్ట్ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రత్తయ్యతోపాటు మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు, సినీ నటులు, నిర్మాత డాక్టర్ మాదల రవి, హైదరాబాద్ అరవిందో ఫార్మసీ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎం వెంకటేశ్వరరావులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే మలినేని ప్రాంగణంలో నూతనంగా నిర్మించ తల పెట్టిన కృష్ణా, గోదావరి బ్లాక్‌ల నిర్మాణానికి సంబంధించిన ఫౌండేషన్ స్టోన్‌ను డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. అనంతరం రత్తయ్య మాట్లాడుతూ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ముఖ్యమన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించటం హర్షణీయమన్నారు. జనరల్ నాలెడ్జితో పాటు ధృడ సంకల్పం ముఖ్యమన్న విషయాన్ని విద్యార్థిని గుర్తించటంతో పాటు స్వశక్తిగా ఏదైనా సాధించగలననే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వీ పద్మారావు తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడల ప్రారంభ సూచికంగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

అనంతరం సినీ నటులు మాదల రవి, అరవిందో ఫార్మసీ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఎం వెంకటేశ్వరరావు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తొలుత ముఖ్య అతిథులకు విద్యార్థుల కోలాటాలతో, వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

నేడు వక్ఫ్ రక్షణ సభ

దుగ్గిరాల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ పరిరక్షణ కోసం శనివారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని కోరారు. శుక్రవారం స్థానిక ముర్తుజానగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముస్లిం సమాజానికి ముప్పు తెచ్చే, వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని, ముస్లిమేతరులను బోర్డులో సభ్యులుగా చేర్చే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిములంతా నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సయ్యద్ యాకూబ్‌వలి, పఠాన్ మస్తాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కిలోవాట్ ధరలో సగం చెల్లించి

విద్యుత్ లోడు పెంచుకోండి

దుగ్గిరాల, మార్చి7: అదనపులోడు వినియోగిస్తున్న విద్యుత్ వినియోగదారులు 50 శాతం చెల్లించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఏఈ వసంతరావు తెలిపారు. ఏసీలు వినియోగించే విద్యుత్ వినియోదారులందరూ, విద్యుత్ లోడు 2 కిలో వాట్లు కలిగి యుండాలన్నారు. 0.26, 0.38, 0.56 చొప్పున కలిగిన ప్రతిఒక్కరూ అదనపులోడు చెల్లించి అపరాధ రుసుము చెల్లించే అవసరం లేకుండా చేసుకోవచ్చునని తెలిపారు. గతంలో కిలోవాట్‌కు రూ.2550 చెల్లించాల్సివచ్చేదని, ఈనెల31లోగా చెల్లించేవారు రూ.1250 చెల్లిస్తే సరిపోతుందన్నారు.

ఆధునిక వ్యవసాయంపై

రైతులు దృష్టి సారించాలి

కాకుమాను, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని రేటూరులో శుక్రవారం బాపట్ల ఎన్టీఆర్ అగ్రికల్చరల్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డీడీ స్మిత్ ఆదేశాలతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో లావణ్య, పీడీ వెంకటేశ్వర్లు, టీచింగ్ అసోసియేషట్ శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

27 మందికి ఉద్యోగాలు

తాడికొండ(లాం)మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రాంగణ ఎంపికల్లో 27 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. శుక్రవారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో బెంగళూరుకు చెందిన మెడ్ టెక్ హైర్ కంపెనీ మెడికల్ డాక్యుమెంట్ రివ్యూ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు, బీ.ఫార్మసీ, ఫార్మడీ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగాలకు 70 మంది విద్యార్థులు పాల్గొన్న వారికి ముందుగా గ్రూప్ డిస్కషన్, టెక్నికల్‌రౌండ్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. వారిలో 27 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్వ్యూలను కంపెనీ హైర్ టీం హెడ్ నాగార్జున, ఏ.అంజన్, జయశ్రీలు నిర్వహించారు. ఉద్యోగాలకు సాధించిన విద్యార్థులను చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వీ.ఆంజనేయులు అభినందించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

దుగ్గిరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం దుగ్గిరాలలో ద్వితీయవార్షిక తొలిరోజు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు సాకేత్‌శర్మ, రామచంద్రల పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం 6గంటలకు సుప్రభాతసేవ, నవనీతహారతి, నిత్యకైంకర్యారాధన జరిపారు. ఈనెల 11వతేదీ వరకూ ఐదురోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా, ఉదయం 7 గంటలకు గోపూజ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనానంతరం ఉత్సవమూర్తులకు స్నపన, స్వామివారిని పెండ్లికుమారుని చేయుట, అమ్మవార్లను పెండ్లికుమార్తెలను చేయుట తదితదర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తర్థీప్రసాద వితరణ గావించారు. ఆలయప్రాంగణాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలకంరించారు.


కల్యాణ వేంకటేశ్వర స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో విద్యార్థినికి బహుమతి పంపిణీ చేస్తున్న డాక్టర్ చంద్రహాస్, అనంతకుమారి

మహిళ సాధికారతతోనే సమాజ శ్రేయస్సు

- అంతర్జాతీయ మహిళ దినోత్సవ కార్యక్రమాల్లో వక్తలు

కాకుమాను, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారతతోనే సమాజ శ్రేయస్సు సాధ్యమని ఎంఈవో కె.ఎఫ్ కెన్నడీ అన్నారు. మండల పరిదిలోని చిన్నలింగాయపాలెం ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళలదే ప్రముఖ పాత్ర అని, కుటుంబ ప్రగతి కోసం ఓర్పు, సహనంతో మహిళలలు ఎన్నో త్యాగాలు చేస్తున్నట్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు జమాయమ్మ, సురేంద్ర, చలపతిరావు పాల్గొన్నారు.

తాడికొండ(మోతడక)(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చలపతి ఎడ్యుకేషన్ సొసైటి కోశాధికారి యలమంచలి అనంతకుమారి అన్నారు. మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ చంద్రహాస్ మాట్లాడుతూ చదువుతో పాటు నైపుణ్యాన్ని, సృజనాత్మకతను చాటాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగోళి, పాటలు, డాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

తుళ్లూరు, (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు ఎంపీడివో కార్యాలయంలో ఎంసీబీఎంఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మండలంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న 25 మంది మహిళలకు మహిళా దినోత్సవ పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వీరయ్య డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రపాడు జిల్లా పరిషత్ హై స్కూల్లో బీజేపీ మండల అధ్యక్షుడు షేక్ బాషా ఆధ్వర్యంలో పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయులు పి.శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో మహిళా దినోత్సవం నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వైవి సుబ్బారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మహిళ ఉపాధ్యాయులతో పాటు జాతీయ, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థునులు వాసంతి, శ్రీవల్లి, కోమలి తదితరులను శాలువాతో సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కోటా శివ, జనసేన నేత కందుల సైదయ్య, బీజేపీ నేతలు పసుపులేటి సాయి, కొండపోగు మహా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కట్రపాడు గ్రామ అండన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసు మాదవి హాజరై మహిళల హక్కులు, చట్టాలతో పాటు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్వాతి, అంగన్‌వాడీలు కమల, పుష్పావతి, ఆశా వర్కర్ మేరమణి పాల్గొన్నారు.

ఆదాయాభివృద్ధికి రుణాలు వినియోగించుకోవాలి

- వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మీ

తాడికొండ(పొన్నెకల్లు)మార్చి7 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు ఆదాయ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం తాడికొండ మండలం పొన్నెకల్లు ఎస్‌బీఐ బ్యాంకు పరిధిలో స్వయం సహాయక సంఘాలకు రుణమేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి పీడీ ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు రూ. 4 కోట్లు రుణాలను ఎస్‌బీఐ బ్యాంక మంజూరు చేసిందన్నారు. మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడి వ్యాపారాలు స్థాపించి ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. తీసుకున్న రుణాలను బ్యాంకులకు సకాలంలో చెల్లించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా నిలబడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం కృష్ణకుమార్ ప్రభు, నీటి సంఘం అధ్యక్షులు గుంటుపల్లి మదుసూదన రావు, బ్యాంకు రీజనల్ మేనేజర్ సత్య సరూపిణి, బ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్, డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ కేశవ కుమార్, ఏపీఎం సాంబశివరావు, సీసీలు, యానిమేటర్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ

తాడికొండ(లాం)మార్చి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ పేర్కొన్నారు. పోటీలలో గెలుపొంది పతకాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్-2025 కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న చలపతి ఇంజనీరింగ్ విద్యార్థులు, టెక్నికల్, కల్చరల్ పోటీలలో ప్రథమ, ద్వితీయ విభాగాల్లో పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న టీ.కీర్తి, డీ.అభిత, టీ.కృష్ణ, ఎన్.మంజునాథ్, ఎన్.భార్గవ్‌లు పతకాలు సాధించి కళాశాల ప్రతిష్ఠ పెంచారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ వై.వీ.ఆంజనేయులు, సెక్రటరి వై.సుజిత్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.తిరుపతినాయుడు, కే.శ్రీనివాసరావు, కే.వెంకటరామారావు, వీ.వీ.నరేంద్ర కుమార్, జే.లక్ష్మీనారాయణ, చందురవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు..

వట్టిచెరుకూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు ఉన్నతమైన లక్ష్యాలు కలిగి వాటిని సాధించేందుకు కృషి చేయాలని గుంటూరు యువజన సర్వీసులశాఖ ముఖ్య నిర్వాహణ అధికారి ఆర్ చంద్రముని అన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఆదేశాలతో గుంటూరు యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని ముట్లూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వ్యక్తిత్వవికాసం, కెరీర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ గుంటూరు మేనేజర్ బీ రాధిక, కెరియర్ కౌన్సిలింగ్ ట్రైనర్ సీహెచ్ వెంకట్, హెచ్‌ఎం జోషిమేరి పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొన్నూరు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి అర్బన్ పోలీసుల కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని ధనలక్ష్మీ లాడ్జిలో కొద్ది రోజులుగా ఒక వ్యక్తి రోజువారీ అద్దె చెల్లిస్తూ నివాసం ఉంటున్నాడు. ఉదయం వేళ కూలి పనులు చేసుకుని రాత్రివేళ లాడ్జిలో ఉంటున్న వ్యక్తి ఈ నెల 5న స్పృహ కోల్పోయి ఉండగా లాడ్జి నిర్వాహకులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

ఆలపాటికి ఘన స్వాగతం పలుకుదాం: పట్టణ టీడీపీ అధ్యక్షుడు హరిప్రసాద్

తెనాలి రూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించి తొలిసారిగా తెనాలి విచ్చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఘన స్వాగతం పలుకుదామని పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తెనాలి, వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం తెనాలి రానున్నారని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు మండలంలోని సంగంజాగర్లమూడి వినాయక స్వామి దేవస్థానం నుంచి విజయ యాత్ర ప్రారంభమై ఎన్‌వీఆర్ కన్వెన్షన్ సెంటర్ వరకూ జరుగుతుందన్నారు. కూటమి శ్రేణులు, ఆలపాటి అభిమానులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆలపాటికి అభినందనలు

కొల్లిపర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘన విజయం సాధించడంపై మండల టీడీపీ నాయకులు శుక్రవారం ఆయనను కలిసి అభినందించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలిసి అభినందించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీచైర్మన్ వి.సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కె.అమృతరాజు, నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఎ.శివనాగమల్లేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు జి.గోవర్ధనరెడ్డి, కె.అంజనేయులు, ఎన్.లింగారావు, డి.నరసయ్య, డి.చిన్నా, పి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

● తెనాలి అర్బన్: ఎమ్మెల్సీగా విజయం సాధించిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను నాయీ బ్రాహ్మణుల సంఘం సన్మానించారు. శుక్రవారం సంఘ అధ్యక్షుడు చందర్లపాటి సూర్యవెంకటేష్, రాజా రమేష్, ఏడుకొండలు, దామోదరరావు, కోటేశ్వరరావు, నాగరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

12న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి: ములకా

కొల్లిపర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఈ నెల 12వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అత్తోటలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కోటా చంద్రశేఖర్, జిలుగు ముక్కంటి, ఎ. శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా మెడికల్ క్యాంపు

తెనాలి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ది పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నారు. సొసైటీ సభ్యులు శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. గత 29ఏళ్లుగా సొసైటీ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తోంది. కార్యక్రమంలో సీనియర్ డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యంకు వైద్య సేవా రత్న బిరుదు ప్రదానం చేయనున్నారు. ముత్తింశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ప్రతినిధులు జొన్నాదుల నరసింహారావు తదితరులు కోరారు.

శ్రీపరంజ్యోతి భగవాన్‌కు ప్రత్యేక పూజలు

తెనాలి, మారీసుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుర్రిపాలెంలోని శ్రీసర్వదేవ పరంజ్యోతి మానవ సేవా ఆలయంలో శుక్రవారం శ్రీపరంజ్యోతి భగవాన్ జన్మదినం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పరంజ్యోతి భగవాన్ పాదాలకు విశేష అభిషేకాలను నిర్వహించి 1200 మంది భక్తులతో పాదుకాభిషేకాన్ని నిర్వహించారు.

15 నుంచి ప్లాస్టిక్‌పై నిషేధం: కమిషనర్

పొన్నూరు టౌన్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మార్చి 15 నుంచి పొన్నూరు పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయంలో పట్టణంలోని అధికారులు, దుకాణ యజమానులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ పొన్నూరు అమలులో భాగంగా వినియోగదారులు జ్యూట్ బ్యాగ్‌లు అనుమతించిన కవర్‌లను చేతిసంచులను వెంట తెచ్చుకుని వస్తు సామాగ్రి రవాణాకు వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో వర్తక సంఘాల నాయకులు, పారిశుధ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు రుణపడిన మహిళా సమాజం: మోసిగంటి

పొన్నూరు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన ఎన్టీఆర్‌కు మహిళా సమాజం సదా రుణపడి ఉంటుందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి శుక్రవారం అన్నారు. భారతదేశంలో మొట్టమొదటిగా మహిళలకు ఆస్తి హక్కులు ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు గతంలో విలియం కేరీ, రాజారామ్మోహన్‌రావు వంటి సంఘ సంస్కర్తలు పోరాడారని గుర్తుచేశారు.



బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న మంత్రి మనోహర్

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఉన్న పేదలకు ఖరీదైన వైద్యాన్ని పొందేందుకు వారిపై ఆర్థికభారం పడకుండా సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా అండగా నిలుస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలి నియోజవర్గంలోని ముగ్గురు బాధితులు వివిధ అనారోగ్య సమస్యలతో సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం ఇటీవల మంత్రి మనోహర్‌ను కలిసి అర్జీలు పెట్టుకున్నారు. స్పందించిన మంత్రి మనోహర్ వారికి శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మొత్తం రూ.1,42,059 విలువైన చెక్కులను సచివాలయంలో లబ్ధిదారుల కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఖరీదైన వైద్యసేవలను పేదలు సైతం పొందేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో శస్త్ర చికిత్సలకు ఆర్థిక స్తోమత లేక ప్రభుత్వసాయం కోరిన వారికి భరోసాగా నిలుస్తూ సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా సాయం అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం పేదల అభ్యున్నతికి పాటుబడుతుందని రానున్న రోజుల్లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత మంచిచేసేలా ముందుకు సాగుతున్నామన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు అగ్రగామిగా నిలవాలి

● మహిళా దినోత్సవంలో సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలి రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ అగ్రగామిగా నిలవాలని సబ్‌కలెక్టర్ సంజనా సింహ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అత్తోట దీప్తి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ సంజనా సింహ పాల్గొని జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆమె మహిళా సాధికారతపై ప్రసంగించారు. అనంతరం విధి నిర్వహణలో పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళా సచివాలయ ఉద్యోగులను అభినందించి బహుమతులు అందించారు. మండలంలోని సచివాలయ మహిళా ఉద్యోగులు, మండల పరిషత్ మహిళాఉద్యోగులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: మండలంలోని కఠెవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం తాటి శ్రీధర్, ఉపాధ్యాయులతో కలిసి మహిళా టీచర్లను, సిబ్బందిని సత్కరించారు.



బహుమతులు అందిస్తున్న సబ్‌కలెక్టర్ సంజన సింహ

సంగం డెయిరీలో...

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళ సాధికారతతోనే సమాజ శ్రేయస్సు సాధ్యమని ట్రైనీ ఐపీఎస్ అధికారి దీక్ష అన్నారు. వడ్లమూడి సంగం డెయిరీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఐపీఎస్ అధికారిణి దీక్ష మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళలదే ప్రముఖ పాత్ర అన్నారు. మహిళల రక్షణ భద్రతే ప్రథమ ప్రాధాన్యంగా పని చేస్తున్నట్లు చెప్పారు. మరో ముఖ్య అతిథి డీవీసీ హాస్పిటల్ ఎండీ ధూళిపాళ్ల జ్యోతిర్మయి మాట్లాడుతూ కుటుంబ ప్రగతి కోసం ఓర్పు, సహనంతో మహిళలు ఎన్నో త్యాగాలు చేస్తున్నారని కొనియాడారు. సంగం డెయిరీ విభాగాలలో మహిళల భద్రత కోసం చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కమిటీలను ఏర్పాటుచేసి మహిళల హక్కులకు భంగం వాటిల్లకుండా కాపాడుతున్నట్లు చెప్పారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



మహిళ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ట్రైనీ ఐపీఎస్ దీక్ష, ధూళిపాళ్ల జ్యోతిర్మయి

● పొన్నూరు టౌన్ (చేబ్రోలు): చేబ్రోలు ఆర్వీఐటీ కళాశాలలో శుక్రవారం మహిళ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, త్రో బాల్, టెన్నీకాయిట్ చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ సందర్భంగా జరిగిన సభలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణయ్య, ప్రెసిడెంట్ ఆర్ వంశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్, ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశం




పరిశ్రమల శాఖ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంఎస్‌ఎంఈ క్లస్టర్లు ఏర్పాటుకు అనుకూలమైన భూములను పరిశ్రమలు, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ వెంటనే గుర్తించాలన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో గోల్డ్ స్మిత్, హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. సింగిల్ డెస్క్‌లో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సంబంధిత శాఖలు సక్రమంగా తనిఖీచేసి పెండింగ్ లేకుండా నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. జిల్లాలో 49 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, పవర్ కాస్ట్ సబ్సిడీ రీయింబర్స్‌మెంట్‌లకు సంబంధించి రూ. 2,12,79,045 మంజూరుచేస్తూ సమావేశంలో కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, జిల్లా ఉప రవాణ కమిషనర్ సీతారామిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్‌రెడ్డి, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరక్టర్ వందనం, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ బీహెచ్ మనోరమ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎంవీ శివకుమార్, కార్మిక శాఖ సహాయక కమిషనరు కృష్ణవేణి, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నైపుణ్యాధికారి అధికారి సంజీవ్‌రావు, మార్కెటింగ్ శాఖ ఏడి రాజబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

● కమిషనర్ శేషన్న



తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న, ఇన్‌చార్జ్ డీఈ శ్రీనివాసరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకి పెరుగుతున్న ఎండ తాకిడికి తాగునీటి వినియోగం పెరగనుందని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక వీఎస్‌ఆర్ కళాశాల సమీపంలోని ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రాన్ని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా 40 వార్డులకు సరఫరా అవుతున్న నీటి వివరాలు, నీటి నిల్వ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వార్డుల్లో ఎవరైనా తాగునీటి సమస్యపై తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారానికి కృషిచేయాలన్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఆయనతో పాటు ఇన్‌చార్జ్ డీఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసులు, మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతక్కి అబ్రహంకు ఘన నివాళి



అబ్రహం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎస్పీ, తహసీల్దార్ తదితరులు

తెనాలి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న అసమానతలను నివారించేందుకు కవి నూతక్కి అబ్రహం రచనలు దోహదపడ్డాయని డీఎస్పీ జనార్దనరావు చెప్పారు. కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో శుక్రవారం అబ్రహం 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పది అవార్డులు అందుకున్న కవి పూర్ణప్రజ్ఞాచారిని సన్మానించారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఉన్నం ఏస్కేల్, ఉన్నం ధర్మారావు, కూచిపూడి మోహన్, సుద్దపల్లి మురళీధర్, రవికిరణ్, వినయ్, పీటర్‌పాల్ పాల్గొన్నారు.

దారి దోపిడీ కాదు.. ఆత్మహత్యాయత్నం

తెనాలిరూరల్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి కఠెవరం శివారులో ఆటోలో కత్తితో దాడిచేసిన వ్యక్తి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. బాధితుడే ఆర్థికంగా చితికిపోయి అప్పుల ఊబిలో నుంచి బయట పడలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఓపెన్ యూనివర్శిటీ అడ్మిషన్ల నిలిపివేతపై ఆందోళన

తెనాలి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ అడ్మిషన్ల నిలిపివేతపై డిస్టెన్స్ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. విభజన చట్టం అనంతరం పదేళ్ల పాటు ఓపెన్ యూనివర్శిటీ సేవలు అందించిందని ఈ విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు నిలిపివేసిందని పలువురు విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేశారు. దీని కారణంగా ఎంతోమంది విద్యార్థులు డిగ్రీ, పీజీ విద్యను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని కోరారు.

కాంచనమాల పుస్తకావిష్కరణ



కాంచనమాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ దక్షిణామూర్తి

తెనాలి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బాలీవుడ్, టాలీవుడ్‌లో సినీనటి కాంచనమాల డ్రీమ్‌గర్ల్‌గా వెలుగొందారని సీనియర్ వైద్యుడు పాటిబండ్ల దక్షిణామూర్తి పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో శుక్రవారం తెలుగు సినిమా డ్రీమ్‌గర్ల్ కాంచనమాల పేరుతో రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. చరిత్ర పరిశోధకుడు పారా అశోక్‌కుమార్ సంపాదకత్వంలో మోనోగ్రాఫ్ పుస్తకంలో కాంచనమాల జీవిత విశేషాలను అందించారని అభినందించారు. తెనాలిలో నివసించిన కాంచనమాల చివరి రోజుల్లో తాను వైద్యం అందించానన్నారు. ప్రజా సాహితీ సంపాదకులు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ, చరిత్ర పరిశోధన కృషిని కొనసాగించాలన్నారు. ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, డాక్టర్ ఆర్.వీరనారాయణ, మొవ్వా సత్యనారాయణ, రామరాజు, వెంకటేశ్వరరావు, జుగాష్, కన్నా, రమేష్, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు చిత్తు: డీఎస్పీ



ఉమెన్స్ గ్రీవెన్స్ డే అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు తదితరులు

తెనాలి, మారీసుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను చిత్తు చేసుకోవద్దని డీఎస్పీ బి.జనార్ధనరావు అన్నారు. శుక్రవారం స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర ఐపీఎస్ విగ్రహం వద్ద డీఎస్పీ జనార్ధనరావు ఆధ్వర్యంలో ఉమెన్స్ గ్రీవెన్స్ డే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఉమెన్స్ గ్రీవెన్స్ సెల్‌కి ఫిర్యాదులు చేయాలని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పట్టణంలో ఉమెన్స్ గ్రీవెన్స్ డే అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో త్రీటౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు శారదా సర్వీసు సొసైటీ కృషి

● మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని

తెనాలి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారితకు శారదా సర్వీసు సొసైటీ కృషి చేస్తోందని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ప్రశంసించారు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వృత్తి కోర్సులలో శిక్షణ పొందిన వారికి శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, కరోనా సమయంలో వెలకట్టలేని వైద్య సేవలను అందించారన్నారు. ప్రతి నెలా షుగర్ వ్యాధిగ్రస్థులకు వైద్య శిబిరాలు, మహిళల ఆరోగ్యానికి అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు మహిళలకు వృత్తి విద్యా కోర్సులు నేర్పి వారి కుటుంబ ఆర్థిక పురోభివృద్ధికి సొసైటీ దోహదపడుతుందన్నారు. డాక్టర్ శారద, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, వెంకటరత్నం, హృదయరాజు, శాస్త్రి, సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న రాజకుమారి



కుక్కల శస్త్ర చికిత్సల వివరాల నమోదు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న, పక్కన అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

కుక్కల నియంత్రణ చర్యల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తెనాలి, మారీసుపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు రోజురోజుకి కుక్కకాటు కేసులు పెరుగుతున్నాయని కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మునిసిపల్ అధికారులు స్పందించారు. మునిసిపల్ అధికారులు డంపింగ్ యార్డులో కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు వీధి కుక్కలకు శస్త్రచికిత్సలను ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కుక్కలకు నిర్వహిస్తున్న శస్త్ర చికిత్సల వివరాల నమోదు రిజిస్టర్‌ను కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత కొన్ని నెలలుగా పట్టణ ప్రజలు వీధి కుక్కలు పెరగడం వలన పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేసినఆంధ్రజ్యోతికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఇంటికి రక్షిత నీరు అందించడమే లక్ష్యం

● ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారి భార్గవ్





కొల్లిపర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారి భార్గవ్ శుక్రవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. పలు అంశాలపై ఆయన వెల్లడించిన వివరాలు..

● ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఉందా?

భార్గవ్: మండలంలోని గ్రామాల్లో ఇప్పటివరకు తాగునీటి ఎద్దడి కనపించలేదు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నాం.

● గ్రామాల్లో కుళాయిలు సక్రమంగా పని చేస్తున్నాయా?

భార్గవ్: కుళాయిలు దెబ్బతిన్నాయని గ్రామస్థులు తెలిపిన వెంటనే వాటిని మరమ్మతులు చేయిస్తున్నాం, వీధుల్లో వేసిన కుళాయిలు పనిచేస్తున్నాయి. తాగునీటి సరఫరాకు అటంకంలేకుండా చూస్తున్నాం. ప్రజల నుంచి ఫిర్యాదులు రాగానే వాటిని పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు.

● గ్రామాల్లో పారిశుధ్యంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

భార్గవ్: పంచాయతీ కార్మికులు ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారు కేంద్రానికి తరలిస్తున్నారు.

● గ్రామాల్లో దోమల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

భార్గవ్: దోమల నివారణకు ఫాగింగ్ చేయడంతో పాటు మలాథిన్ చల్లిస్తున్నాం. మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్, మడ్డి ఆయిల్ వేయిస్తున్నాం.

● బహిరంగ మలవిసర్జనపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

భార్గవ్: పంచాయతీ కార్యదర్శులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామాల్లో మైకులో ప్రచారం చేయడంతో పాటు ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేశాం.



శ్రీజనార్దనస్వామిని కొల్లిపర గ్రామవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా జనార్దనస్వామి బ్రహ్మోత్సవాలు

కొల్లిపర, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం పండితులు జగన్నాథాచార్యులు, యోగానంద పృథ్వీ భార్గవ్, వీరభద్రేశ్వరశర్మ, ప్రసాదశర్మ, వెంకటేశ్వరశర్మ, సీతారామాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మలు స్వామి వారికి వివిధ అభిషేకాలతో పాటు కల్యాణ మహోత్సవం నిర్వహించడంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణ మహోత్సవం అనంతరం మహిళలు శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి విగ్రహాలను గరుడవాహనంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు హారతులు ఇచ్చారు.